




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 252 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 19 మే 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 252 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 19 MAY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## డాక్టర్ గా మారిన మంత్రి నాదెండ్ల..!

- కొల్లిపరలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఉచిత వైద్య శిబిరం ప్రారంభం
- గ్రామీణులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యం
- శిబిరంలో 20 మంది నిపుణులైన వైద్యులు, 50 మంది సిబ్బంది సేవలు
- మంత్రి స్వయంగా రోగులతో మాట్లాడి, మందులు పంపిణీ
- త్వరలో రక్తనిధి కేంద్రం ఏర్పాటుకు మంత్రి హామీ





పెన్ పవర్ డెస్క్:రాజకీయ వేత్తగా, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా నిత్యం ప్రజాసేవలో తలమునకలై ఉండే నాదెండ్ల మనోహర్, శనివారం కొల్లిపరలో ఓ కొత్త అవతారమెత్తారు. వైద్యుడిలా మారి, సామాన్య ప్రజలతో మమేకమై, వారి ఆరోగ్య సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుంటూ, వారికి అండగా నిలిచారు. తెనాలి నియోజకవర్గం, కొల్లిపర మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో (సీహెచ్‌సీ) ఆయన చొరవతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరం ఈ అపురూప దృశ్యానికి వేదికైంది.

**పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం**

ఈ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. "గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించాలనే సదుద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశాం. ఆర్థిక ఇబ్బందుల వల్ల గానీ, దూర ప్రాంతాలకు వెళ్లలేని కారణంగా గానీ వైద్య సేవలు పొందలేకపోతున్న ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ భారీ వైద్య శిబిరంలో సుమారు 20 మంది వివిధ విభాగాల నిపుణులైన వైద్యులు, 50 మంది సహాయ సిబ్బంది పాల్గొని సేవలందించారు. స్త్రీల ఆరోగ్యం, చిన్నపిల్లల వైద్యం, చెవి-ముక్కు-గొంతు, కంటి, దంత, గుండె సంబంధిత వ్యాధులకు నిపుణులతో పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఎక్స్‌రే, స్కానింగ్ వంటి రోగ నిర్ధారణ పరీక్షలు, అవసరమైన వారికి చిన్నపాటి శస్త్రచికిత్సలు కూడా ఇక్కడే నిర్వహించారు.

**వైద్యుడిలా మారి.. రోగులతో మమేకం**

కేవలం ప్రారంభోత్సవానికే పరిమితం కాకుండా, మంత్రి మనోహర్ శిబిరం మొత్తం కలియదిరుగుతూ రోగులతో మమేకమయ్యారు. ఓపీ వద్ద బారులు తీరిన రోగుల వద్దకు స్వయంగా వెళ్లి, వారి ఆరోగ్య సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు.

వివరాలు 2లో..

## టీడీపీ కార్యకర్తపై దాడి... నందిగం సురేశ్ అరెస్ట్

- గతరాత్రి ఇసకపల్లి రాజు అనే టీడీపీ కార్యకర్తపై దాడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడి భార్య
- కేసు నమోదు చేసుకున్న తుళ్లూరు పోలీసులు
- నందిగం సురేశ్ ను అరెస్ట్ చేసి తుళ్లూరు పోలీస్ స్టేషన్ కు తరలింపు



పెన్ పవర్ డెస్క్:టీడీపీ కార్యకర్త ఇసకపల్లి రాజుపై దాడి కేసులో వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని తుళ్లూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు. గతరాత్రి అమరావతి రాజధాని పరిధిలోని ఉద్ధండరాయునిపాలెంలోకి ఓ కారు వేగంగా దూసుకువచ్చింది. దాంతో, ఆ కారు డ్రైవర్ ను టీడీపీ కార్యకర్త రాజు మందలించారు. ఈ నేపథ్యంలో, రాజుపై మాజీ ఎంపీ నందిగం సురేశ్ అనుచరులు దాడి చేసి, అతడిని సురేశ్ ఇంటికి బలవంతంగా తీసుకెళ్లినట్టు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ రాజుపై నందిగం సురేశ్, అతడి సోదరుడు ప్రభుదాస్ దాడి చేశారని బాధితుడి భార్య లక్ష్మి తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దాంతో తుళ్లూరు పోలీసులు నందిగం సురేశ్ తదితరులపై కేసు నమోదు చేసి, ఇవాళ అతడిని అరెస్ట్ చేశారు. సురేశ్ సోదరుడు ప్రభుదాస్, మరికొందరు బంధువుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా, నేడు నందిగం సురేశ్ ను అరెస్ట్ చేయడం పట్ల అతడి భార్య ఆగ్రహం వ్యక్తం చేసింది. తన భర్త అరెస్ట్ ను నిరసిస్తూ తుళ్లూరు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టింది.

## విజయనగరంలో విషాదం.. కారులో ఊపిరి ఆడక నలుగురు చిన్నారుల మృతి



పెన్ పవర్ డెస్క్:విజయనగరం రూరల్: విజయనగరం కంటోన్మెంట్ పరిధిలోని ద్వారపూడి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. కారు లాక్ పడటంలో అందులో చిక్కుకున్న నలుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం నలుగురు చిన్నారులు ఆడుకునేందుకు బయటకు వెళ్లారు.

వివరాలు 2లో..

## హైదరాబాద్ గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదంపై రాహుల్ గాంధీ స్పందన



- హైదరాబాద్ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి, పలువురికి గాయాలు
- ఘటనపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే తీవ్ర విచారం
- సీఎం రేవంత్ రెడ్డితో ఫోన్లో మాట్లాడిన ఖర్గే
- బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

వివరాలు 2లో..

## కూటమికి అనంతపురం మీద ప్రేమ ఉందా?

- అనంతపురం ఆర్టీటీ సంస్థకు నిధుల కొరత
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమన్న వైసీపీ
- ఆర్టీటీ ఎఫ్‌సీఆర్ఏ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- సేవా సంస్థపై రాజకీయ కుట్రలు చేస్తున్నారని శ్యామల ఆరోపణ
- కళ్యాణదుర్గంలో బైక్ ర్యాలీ, ఆర్డీవోకు వినతి పత్రం అందజేత

వివరాలు 2లో..



## తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను

- క్షీణించిన శాంతిభద్రతలకు ఈ ఘటనే నిదర్శనమన్న జగన్
- రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన
- పోలీసులపై అధికార పార్టీ నేతల తీవ్ర ఒత్తిడి: జగన్ ఆరోపణ
- ఫిర్యాదుదారులపైనే ఎదురు కేసులు బనాయిస్తున్నారన్న జగన్
- దాడి ఘటన నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్

పెన్ పవర్ డెస్క్:తిరుపతిలో ఇంజినీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై జరిగిన దాడిని వైసీపీ అధినేత జగన్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, దళితులు, బలహీన వర్గాలపై దాడులు నిత్యకృత్యంగా మారాయని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్

వివరాలు 2లో..



## గాజాపై మరోసారి ఇజ్రాయెల్ నిప్పుల వర్షం... 66 మంది మృతి



- గాజాలోని పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు
- శనివారం రాత్రి దాడుల్లో 66 మంది పాలస్తీనియన్ల మృతి
- మృతుల్లో ఏడుగురు చిన్నారులు, ఒకే కుటుంబానికి చెందిన 9 మంది
- ఖాన్ యూనిస్, ఉత్తర గాజా, జబాలియా శరణార్థి శిబిరాలపై దాడులు
- హమాస్ కాల్పుల విరమణను తిరస్కరించడం వల్లే దాడులన్న నెతన్యాహు

వివరాలు 2లో..

## జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్లు బంద్

- తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్...!
- అద్దె పద్ధతిలో థియేటర్లు నడపలేమని డిస్ట్రిబ్యూటర్లు స్పష్టీకరణ
- వసూళ్లలో వాటా (పర్సంటేజీ) విధానం అమలు చేయాలని డిమాండ్
- దిల్ రాజు, సురేష్ బాబుతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో ఎగ్జిబిటర్ల భేటీ
- నిర్మాతలకు లేఖ ద్వారా తమ నిర్ణయం తెలియజేయాలని తీర్మానం




పెన్ పవర్ డెస్క్: తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో కీలక పరిణామం చోటుచేసు కుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని సినిమా ఎగ్జిబిటర్లు సంచలన నిర్ణయం తీసుకున్నారు. జూన్ 1వ తేదీ నుంచి థియేటర్లను నిరవధికంగా మూసివేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రస్తుతమున్న అద్దె (రెంటల్) పద్ధతిలో థియేటర్లను నడపడం తమకు సాధ్యం కావడం లేదని, కేవలం సినిమా వసూళ్లలో వాటా (పర్సంటేజీ) పద్ధతిని అమలు చేస్తేనే థియేటర్లను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.ఈ రోజు (ఆదివారం) హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయంలో తెలుగు రాష్ట్రాల ఎగ్జిబిటర్ల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, డి. సురేష్ బాబు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎగ్జిబిటర్లు తమ సమస్యలను, ఆర్థిక ఇబ్బందులను నిర్మాతలకు వివరించినట్లు సమాచారం.థియేటర్ల నిర్వహణ ఖర్చులు పెరిగిపోయాయని, అద్దె పద్ధతి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఎగ్జిబిటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. "అద్దె ప్రాతిపదికన థియేటర్లను ఇకపై నడిపించలేం. మాకు పర్సంటేజీ రూపంలోనే వాటా కావాలి. అప్పుడే మాకు గిట్టుబాటు అవుతుంది," అని వారు తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఈ మేరకు తమ డిమాండ్లను, నిర్ణయాన్ని వివరిస్తూ నిర్మాతలకు అధికారికంగా

వివరాలు 2లో..

## భారత్ కు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది... పాకిస్థాన్ లో కాల్చివేత

- పాకిస్థాన్‌లో లష్కరే ఉగ్రవాది అబు సైఫుల్లా హతం
- సింధ్ ప్రావిన్స్‌లో గుర్తుతెలియని వ్యక్తుల కాల్పులు
- నాగ్‌పూర్ ఆర్ఎస్ఎస్ కార్యాలయం దాడిలో ప్రధాన సూత్రధారి
- రాంపూర్, బెంగళూరు దాడుల్లోనూ కీలక పాత్ర ప్రభుత్వ భద్రత ఉన్నప్పటికీ హత్య



వివరాలు 2లో..

## మళ్లీ ఉద్ధృతంగా కరోనా వ్యాప్తి... కొత్త వ్యాక్సిన్ కు అమెరికా గ్రీన్ సిగ్నల్

- ఆసియా దేశాల్లో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు
- హాంకాంగ్, సింగపూర్‌లలో ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య అధికం
- వ్యాక్సిన్ రోగనిరోధక శక్తి తగ్గడమే కారణమంటున్న నిపుణులు
- LP.8.1, XFC కొత్త వేరియంట్ల వ్యాప్తిపై ఆందోళన
- ప్రజలు బూస్టర్ డోసు తీసుకోవాలని వైద్య నిపుణుల సూచన
- నోవావాక్స్ కొత్త వ్యాక్సిన్‌కు అమెరికా FDA ఆమోదం

పెన్ పవర్ డెస్క్: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో, ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్ వంటి ఆసియా దేశాల్లో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. గత కొన్ని వారాలుగా ఇన్ఫెక్షన్ల సంఖ్య గణనీయంగా పెరగడమే కాకుండా, ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్య కూడా అధికమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, ఈ నగరాల్లో కోవిడ్ కేసులు, ఆసుపత్రి చేరికలు, మరణాలు కూడా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వ్యాక్సిన్ల ద్వారా లభించిన

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# షరతులు వర్తిస్తాయ్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుమహిళలకు గుడ్ న్యూస్ చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు సౌకర్యాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఎన్నికలకు ముందు మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రకటించారు. ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రకటించడం పట్ల మహిళలు ఉచిత బస్సు పథకం అమలు కోసం సుదీర్ఘకాలం నుంచి వెయిట్ చేస్తున్నారు. ఇంకా మూడు నెలలు సమయం ఉండటంతో మహిళలు అప్పటి వరకూ వెయిట్ చేయాల్సి ఉన్నప్పటికీ ఉచిత బస్సు పథకం అమలులో ప్రభుత్వం ఏ ఏ నిబంధనలను విధిస్తుందోనన్న ఆందోళన అయితే మాత్రం ప్రతి ఒక్కరిలో వ్యక్తమవుతుంది.

**ఖజానాకు భారం కాకుండా...**

ఈ పథకం ఇప్పటికే అమలులో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో తెలంగాణలో కొంత సక్సెస్ గా కనిపిస్తున్నప్పటికీ, కర్ణాటకలో మాత్రం సర్కార్ కు ఈ పథకం భారంగా మారింది. ఈ రెండు రాష్ట్రాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత మహిళ బస్సు అమలు చేయడంతో ఆర్టీసీకి నష్టం వచ్చి, వాటిని భరించేందుకు ఇతర ఛార్జీలను పెంచుతున్నారు. దీంతో పాటు సరైన ముందస్తు చర్యలు తీసుకోకుండా హడావిడిగా అమలు చేయడంతో బస్సుల్లో మహిళలు సీట్ల కోసం కొట్టుకుంటున్నారు. టటిక్కెట్ కొన్న పురుషులకు సీట్లు దొరకడం లేదు. పథకం అమలు చేసే ముందు సరిపడా బస్సులను కొనుగోలు చేయకపోవడం వల్లనే ఈ సమస్య తలెత్తిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తించింది.

**అధ్యయనం చేసిన తర్వాత...**

కానీ ఆంధ్రప్రదేశ్ బాగా అధ్యయనం చేసిన తర్వాత మాత్రం ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు చేసింది. ఇప్పటికే కొన్ని బస్సులను కొనుగోలు చేసిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లోని ముఖ్యమైన నగరాలకు, పట్టణాలకు పంపుతూనిర్ణయం తీసుకుంది. తక్కువ ఖర్చుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించేందుకు ఎలక్ట్రిక్ బస్సులు ఉపయోగపడనున్నాయి. నగరాల్లోనే ఎక్కువ రద్దీ ఉంటుందని భావించి అక్కడ ఎక్కువ బస్సులను కొనుగోలు చేస్తుంది. అలాగే ఈ పథకం జిల్లాలకే పరిమితం చేయాలని నిర్ణయించింది. ఆ యా జిల్లాలకు చెందిన మహిళలు ఆ జిల్లా పరిధిలోనే ఉచితంగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఉచిత బస్సు పథకంలో మరికొన్ని నిబంధనలు అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

# డాక్టర్ గా మారిన మంత్రి నాదెండ్ల..!

- మొదటి పేజీ తరువాయి

వారిని ఆయా విభాగాల వైద్యుల వద్దకు తోడ్కొనివెళ్లి, సరైన వైద్యం అందేలా పర్యవేక్షించారు. పరీక్షలు పూర్తయిన వారికి అవసరమైన మందులను కూడా తన చేతుల మీదుగా అందించడం విశేషం. ఆయన ఆప్యాయత, చొరవ అక్కడున్న వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. అధికారిక హోదాను పక్కనపెట్టి, ఒక సాధారణ వ్యక్తిలా, ఒక వైద్యుడిలా ఆయన అందించిన సేవలు ప్రజల మన్ననలు పొందాయి. "ప్రజల మంత్రిగా, ఇప్పుడు 'ప్రజల డాక్టర్‌గా' కూడా ఆయన మా మనసు గెలుచుకున్నారంటూ" స్థానికులు, రోగులు హర్షం వ్యక్తం చేశారు.

**రక్తనిధి కేంద్రం ఏర్పాటుకు హామీ**

భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం కొల్లిపర సీహెచ్‌సీలో ఒక రక్తనిధి కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఇలాంటి శిబిరాల ద్వారా మారుమూల ప్రాంత ప్రజలకు కూడా నాణ్యమైన వైద్య సేవలు చేరువవుతాయని మంత్రి మనోహర్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను

- మొదటి పేజీ తరువాయి

మీడియాలో స్పందించారు. "తిరుపతిలో ఇంజినీరింగ్ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. రాష్ట్రంలో దిగజారిపోయిన శాంతి భద్రతలకు, దళితులపై తీవ్రమవుతున్న దాడులకు ఈ ఘటన ఒక ఉదాహరణ. దళితులు, తమ గొంతు గట్టిగా వినిపించలేని వర్గాల వారికి ఈ రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయింది. చంద్రబాబు, అధికారపార్టీ నాయకుల డైరెక్షన్‌లో కక్ష సాధింపు చర్యల్లో మునిగితేలుతున్న పోలీసు యంత్రాంగం పౌరులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించడంవల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట దళితులపైన దాడులు జరుగుతూనే ఉన్నాయి. పోలీస్‌స్టేషన్లకు వెళితే న్యాయం

జరుగుతుందన్న నమ్మకం పోవడమేకాదు, ఫిర్యాదుదారులమీదే ఎదురు కేసులు పెట్టడం పరిపాటిగా మారింది. జేమ్స్‌పై దాడి ఘటనలో పోలీసు యంత్రాంగం వైఫల్యమే కాదు, రాజకీయ జోక్యంతో కనీసం ఫిర్యాదునుకూడా స్వీకరించలేని పరిస్థితి. తిరుపతి ఘటనకు కారకులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను" అంటూ జగన్ ట్వీట్ చేశారు.

# కూటమికి అనంతపురం మీద ప్రేమ ఉందా?

**పెన్ పవర్ డెస్క్:** జిల్లాలో అనేక ఏళ్లుగా విశేష సేవలం దిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సంస్థ ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోందని, దీనికి అందాల్సిన విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విడుదల చేయాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల డిమాండ్ చేశారు. ఆర్డీటీ ఎదుర్కొంటున్న సంక్షోభం పట్ల ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నా యని ఆమె ఆరోపించారు. ఈ సందర్భంగా శ్యామల స్పందిస్తూ, "కొన్నేళ్లుగా అనంతపురం ప్రజలకు తల్లిలా సేవలు అందిస్తున్న ఆర్డీటీ నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా చేతులు కట్టుకుని చూస్తున్నాయి," అని విమర్శించారు. "కులం, మతం, ప్రాంతం వంటి భేదాలు చూడకుండా నిస్వార్థంగా సేవలు అందించిన ఆర్డీటీ లాంటి సంస్థపై కొందరు రాజకీయాలు చేయడం దారుణం. సేవ చేయని వారిని వదిలేసి, అలుపెరుగక సేవ చేస్తున్న వారిపై ఇలా తూట్లు పొడవడం దేనికి సంకేతం?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. "రాయలసీమకు ఎప్పుడూ అన్యాయమే జరుగుతోంది. అడిగితే గానీ అమ్మయినా అన్నం పెట్టదన్నట్లు, సీమకు దక్కేదేమీ లేదు, కొత్తగా వచ్చేదేమీ లేదు," అని శ్యామల ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రజల ప్రాణంగా నిలిచిన ఇలాంటి సేవా సంస్థపై కుట్రలు జరుగుతుంటే చూస్తూ "ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి అనంతపురం జిల్లాపైన గానీ, రాయలసీమపైన గానీ ఏమాత్రం పట్టింపు ఉందా?" అని శ్యామల నిలదీశారు. "కేంద్రంతో పొత్తులో ఉన్నందున, ఆర్డీటీకి ఆగిపోయిన నిధుల గురించి ఎందుకు ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు?" అని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆర్డీటీకి సంబంధించిన ఎఫ్‌సీఆర్ఏ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ఈరోజు (ఆమె ప్రకటన చేసిన రోజు) అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో బైక్ ర్యాలీ నిర్వహించినట్లు శ్యామల తెలిపారు. అనంతరం, ఈ డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీవో)కి అందజేసినట్లు ఆమె వివరించారు. ఈ నిధులు విడుదల కాకపోతే ఆర్డీటీ సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

# భారత్ కు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది... పాకిస్థాన్ లో కాల్చివేత

**పెన్ పవర్ డెస్క్:** భారత్‌లో అనేక ఉగ్రదాడులకు ప్రణాళిక రచించి, వాటిని అమలుపరచడంలో కీలకపాత్ర పోషించిన లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ) సీనియర్ ఉగ్రవాది రజావుల్లా నిజామనీ అలియాస్ అబు సైఫుల్లా పాకిస్థాన్‌లో హతమయ్యాడు. భారత్‌కు మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న సైఫుల్లాను, పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో కొందరు గుర్తుతెలియని సాయుధులు కాల్చి చంపారు. ఈ ఘటన పాకిస్థాన్ ఉగ్రవాదులకు అభయారణ్యంగా మారిందన్న వాదనలకు బలం చేకూరుస్తోంది. అదే సమయంలో అక్కడి ప్రభుత్వ భద్రత ఉన్నప్పటికీ ఇలాంటి హత్యలు జరగడం పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. వివరాల్లోకి వెళితే, పాకిస్థాన్ ప్రభుత్వ వర్గాల నుంచి పరోక్షంగా భద్రత పొందుతున్నట్లు భావిస్తున్న అబు సైఫుల్లా, ఆదివారం మధ్యాహ్నం సింధ్ ప్రావిన్స్‌లోని మట్లీ పట్టణంలో ఉన్న తన నివాసం నుంచి బయటకు వచ్చాడు. సమీపంలోని ఓ కూడలి వద్దకు చేరుకున్న సమయంలో, గుర్తుతెలియని వ్యక్తులు అతడిని లక్ష్యంగా చేసుకుని ఒక్కసారిగా కాల్పులకు తెగబడి హతమార్చినట్లు తెలుస్తోంది. ఈ దాడి పక్కా ప్రణాళికతో జరిగినట్లు ఘటనా స్థలంలోని ఆధారాలు సూచిస్తున్నాయి. భారత్‌లో జరిగిన పలు భారీ ఉగ్రదాడుల్లో అబు సైఫుల్లా కీలక సూత్రధారిగా వ్యవహరించాడు. ముఖ్యంగా, 2006లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఉన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ప్రధాన కార్యాలయంపై జరిగిన ఉగ్రదాడికి ఇతడే ప్రధాన కుట్రదారు అని భారత దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ దాడి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అంతేకాకుండా, 2001లో ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో సీఆర్పీఎఫ్ క్యాంపుపై జరిగిన దాడి, 2005లో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)పై జరిగిన ఉగ్రదాడి ఘటనల్లోనూ సైఫుల్లా ప్రమేయం ఉన్నట్లు బలమైన ఆరోపణలు ఉన్నాయి.

భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో ముందువరుసలో ఉన్న సైఫుల్లా, పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతూ, అక్కడి నుంచి భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు నిధులు సమకూర్చడం, యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు భారత నిఘా వర్గాలు చాలాకాలంగా ఆరోపిస్తున్నాయి. ఇతని మరణం, పాకిస్థాన్ గడ్డపై ఉగ్రవాదులకు రక్షణ కల్పిస్తున్నారన్న భారత్ వాదనకు ఈ ఘటన మరింత బలాన్ని చేకూర్చింది. సైఫుల్లా హతం కావడం లష్కరే తయ్యిబా సంస్థకు పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

# మళ్లీ ఉద్ధృతంగా కరోనా వ్యాప్తి...

# కొత్త వ్యాక్సిన్ కు అమెరికా గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజీ తరువాయి

రోగనిరోధక శక్తి క్రమంగా తగ్గడం, LP.8.1, XFC వంటి కొత్త వేరియంట్ల వ్యాప్తి దీనికి కారణంగా నిపుణులు భావిస్తున్నారు. దీంతో ప్రజలు ముందుజాగ్రత్తగా కరోనా బూస్టర్ డోసు తీసుకోవాలని, ఫ్లూ మాదిరిగానే కోవిడ్ వ్యాక్సిన్‌ను కూడా పరిగణించాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో, పెరుగుతున్న ముప్పును దృష్టిలో ఉంచుకుని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ నోవావాక్స్ సంస్థ అభివృద్ధి చేసిన కొత్త వ్యాక్సిన్‌కు ఆమోదం తెలిపింది.

అమెరికాకు చెందిన అంటువ్యాధుల నిపుణుడు డాక్టర్ మార్క్ ఈ రూప్ ప్రకారం, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎల్‌పీ. 8.1 వేరియంట్ కారణంగా కేసులు అధికమవుతున్నాయి. నమోదవుతున్న కేసుల్లో సుమారు 70% ఈ వేరియంట్ వల్లేనని, మరో 9% కేసులకు ఎక్స్‌ఎఫ్‌సీ వేరియంట్ కారణమని ఆయన తెలిపారు. ఒమిక్రాన్ అసలు వేరియంట్ స్థానంలో దాని ఉప వేరియంట్లు వ్యాప్తిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కొత్త వేరియంట్లు తీవ్ర ప్రాణాంతకమైనవి కానప్పటికీ, తగ్గిన రోగనిరోధక శక్తి వల్ల సులభంగా వ్యాప్తి చెందుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఏప్రిల్ నుంచి ఎల్‌పీ. 8.1 వేరియంట్ యూకే, ఆస్ట్రేలియా సహా అనేక దేశాల్లో ప్రభావం చూపుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ జనవరిలోనే ఎల్‌పీ. 8.1ను 'అండర్ మానిటరింగ్ వేరియంట్'గా గుర్తించింది. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## హైదరాబాద్ గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదంపై రాహుల్ గాంధీ స్పందన

**పెన్ పవర్ డెస్క్:** హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలోని గు ల్జార్ హౌస్ ప్రాంతంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో 17 మంది ప్రాణాలు కోల్పోవడం, అనేక మంది గాయపడటం పట్ల వారు ప్రగాఢ విచారం తెలిపారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణలోని హైదరాబాద్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో పలువురు మరణించడం, అనేక మంది గాయపడటం అత్యంత బాధాకరమని రాహుల్ గాంధీ సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. "ఈ కష్ట సమయంలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను" అని తన సందేశంలో తెలిపారు. మల్లికార్జున ఖర్గే కూడా ఈ అగ్నిప్రమాదంపై స్పందించారు. ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. "హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో అనేక అమూల్యమైన ప్రాణాలు కోల్పోవడం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఈ దుఃఖ సమయంలో బాధితుల కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతి" అని ఖర్గే 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ముఖ్యమంత్రితో మాట్లాడిన అనంతరం, ప్రభుత్వం అవసరమైన అన్ని సహాయక చర్యలు తీసుకుంటుందని, బాధితులకు తక్షణమే తగిన పరిహారం అందిస్తుందని తనకు భరోసా లభించిందని ఖర్గే తెలిపారు. "కాంగ్రెస్ కార్యకర్తలు బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, వారికి సాధ్యమైనంత సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ కష్టకాలంలో మనమందరం కలిసి బాధితులకు అండగా నిలబడదాం" అని ఆయన పిలుపునిచ్చారు.

## గాజాపై మరోసారి ఇజ్రాయెల్ నిప్పుల వర్షం... 66 మంది మృతి

**పెన్ పవర్ డెస్క్:** గాజాలో మరోసారి భయానక వాతావరణం నెలకొంది. ఇజ్రాయెల్ దళాలు గాజాలోని పలు ప్రాంతాలపై శనివారం అర్ధరాత్రి భీకర వైమానిక దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో నిరాశ్రయులు తలదాచుకుంటున్న నివాసాలు, శిబిరాలు లక్ష్యంగా మారడంతో పెద్ద ఎత్తున ప్రాణనష్టం సంభవించింది. మొత్తం 66 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఆరోగ్య మంత్రిత్వ శాఖ అందించిన వివరాల ప్రకారం, ఖాన్ యూనిస్‌లో 20 మంది, ఉత్తర గాజాలో 36 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో మరో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఏడుగురు చిన్నారులు ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అంతేకాకుండా, ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది ఈ దాడుల్లో దుర్మరణం పాలయ్యారు. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడగా, వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే, ఈ తాజా దాడులపై ఇజ్రాయెల్ సైన్యం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. శనివారం ఒక్కరోజే మొత్తం 150 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని, మరో 450 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురైనప్పటి నుంచి ఇప్పటివరకు మూడు వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించినట్లు పేర్కొంది. ఈ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించేందుకు హమాస్ నిరాకరించడం వల్లే దాడులను తీవ్రతరం చేయాల్సి వచ్చిందని ఆయన తెలిపారు.

## జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్లు బంద్

- మొదటి పేజీ తరువాయి

ఒక లేఖ రాయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, జూన్ 1 నుంచి విడుదల కావాల్సిన పలు సినిమాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా చిత్రాల విడుదలకు ఇబ్బందులు తలెత్తవచ్చని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎగ్జిబిటర్ల నిర్ణయంతో తెలుగు సినిమా పరిశ్రమలో కొత్త చర్చ మొదలైంది. ఈ సమస్యకు నిర్మాతలు, ఎగ్జిబిటర్లు కలిసి ఎలాంటి పరిష్కారం కనుగొంటారో చూడాలి.

## విజయనగరంలో విషాదం.. కారులో ఊపిరి ఆడక నలుగురు చిన్నారుల మృతి

- మొదటి పేజీ తరువాయి

ఎంతసేపైనా తిరిగి రాలేదు. వారి తల్లిదండ్రులు వెతికినా కనిపించలేదు. చివరికి స్థానిక మహిళా మండలి కార్యాలయం వద్ద ఆగి ఉన్న కారులో నలుగురు చిన్నారుల మృతదేహాలను అక్కడున్నవారు గుర్తించారు.

సరదాగా ఆడుకునేందుకు కారులోపలికి వెళ్లిన తర్వాత.. లాక్ పడటంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతులను ఉదయ్ (8), చారుమతి (8), చరిష్మా (6), మనస్విగా గుర్తించారు. వీరిలో చారుమతి, చరిష్మా అక్కాచెల్లెళ్లు. ఒకేసారి నలుగురు పిల్లలు కన్నుమూయడంతో ద్వారపూడిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారుల మృతదేహాలను పట్టుకుని తల్లిదండ్రులు, బంధువులు రోధించడం ప్రతి ఒక్కరి హృదయాన్ని ద్రవింపజేస్తోంది.

## స్వర్ణరథంపై శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడు



**తిరుమల పెన్ పవర్ మే 18 :** శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామివారి స్వర్ణరథోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఉత్సవర్లను వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం చేపట్టారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో పి.వరలక్ష్మి, ఈఈ జగన్మోహన్ రెడ్డి, డిప్యూటీ ఈవో దామోదరం, ఏఈవో ఎం. గోపినాథ్, సూపరింటెండెంట్ వి.రమేష్ బాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు డి.మునికుమార్, ఎం.ధోనీ శేఖర్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## ఏపీ జిఎంపి నూతన కమిటీ ఎన్నిక





**శ్రీకాళహస్తి/ పెన్ పవర్/ ప్రతినిధి/ మే 18 :** పట్టణంలోని ఎంజీఎం హాస్పిటల్ లో ఆదివారం ఏపీ జిఎంపి( ఆంధ్రప్రదేశ్ గ్రామీణ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్) సభ్యుల సర్వసభ్య సమావేశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ఎంజీఎం హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ .వివేక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జీఎంపీ సభ్యులకు గుండెకి సంబంధించిన వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాళహస్తి డివిజన్ ఏపీ జిఎంపి అధ్యక్షులుగా ఎం. వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా టి.సురేష్ రెడ్డి, ట్రెజరర్ గా వీరయ్య ,ఎగ్జిక్యూటివ్ కమిటీగా మెంబర్ల గా రాంబాబు, బాలాజీ, తులసమ్మ, నాగరాజు నాయుడు, రాజేంద్ర కుమార్ రెడ్డి, ఎస్ ఎం భాష లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కే ఎన్ రాజు, జిల్లా సెక్రెటరీ ఏడుకొండలు, అసోసియేషన్ సీనియర్ సభ్యులు మోహన్, శివశంకర్, మాల్యాద్రి, కళ్యాణ్ రాజు అధిక సంఖ్యలో జి ఎంపీ సభ్యులు పాల్గొన్నారు.

## కడపలో తిరంగా ర్యాలీ





**కడప పెన్ పవర్ మే 18 :** కడప నగరంలో Citizens for National Security తిరంగా ర్యాలీ విజయవంతంగా నిర్వహించబడింది. జాతీయ భద్రతకు సంఘీభావంగా, మన సైనికుల ధైర్యం, త్యాగం, మరియు దేశ భద్రతను గౌరవించేందుకు ప్రత్యేకంగా ఈ ర్యాలీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పోలిట్ బ్యూరో సభ్యులు & కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, APIIC చైర్మన్ రామరాజు, జమ్మలమడుగు mla ఆది నారాయణ, జమ్మలమడుగు ఇంచార్జి భూపేష్ రెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షులు సుంకర శ్రీనివాస్ గారు, బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి, కూటమి నేతలు – తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత సైనికులు ఆపరేషన్ సింధూర్ ద్వారా పాక్ ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసి, దేశ శత్రువులకు గుణపాఠం చెప్పారు. ఈ సందర్భంలో భారత సైనికుల ధైర్యానికి, దేశ భద్రతకు సంఘీభావంగా మువ్వన్నెల జాతీయ పతాకం చేతబట్టి ర్యాలీ కొనసాగింది. జాతీయ భద్రత మన సమిష్టి బాధ్యత. భారత సైనికుల ధైర్యం, త్యాగం ఎప్పుడూ గర్వకారణం. ప్రతి పౌరుడు జాతీయ భద్రతకు అండగా ఉండాలి అని రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి గారు పేర్కొన్నారు.

## శ్రీకాళహస్తిలో ఘనంగా మినీ మహానాడు





**శ్రీకాళహస్తి/ పెన్ పవర్/ ప్రతినిధి/ మే 18 :** శ్రీకాళహస్తి నియోజకవర్గం లో ఘనంగా మినీ మహానాడు కార్యక్రమం జరిగింది. స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులర్పించిన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జోల వెంకట సుధీర్ రెడ్డి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, మరియు నియోజకవర్గ పరిశీలకులు అంకయ్య చౌదరి. వేలాదిగా తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, మాట్లాడుతూ నాకు ఈ స్థానం కల్పించిన ప్రతి ఒక్క కార్యకర్తకు పాదాభివందనం చేస్తున్నట్లు శ్రీకాళహస్తి శాసనసభ్యులు ప్రజల బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ మే 18 :** వాతావరణ శాఖ సూచనల ప్రకారం రాగల రెండు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని, తదనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రెవిన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే ఉరుములతో కూడిన వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉన్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, బహిరంగ ప్రదేశాలలో ఉండకూడదని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. పొలాల్లో పనిచేసే రైతులు, బహిరంగ ప్రదేశాల్లో పని చేసేవారు, రైతులు, పశువుల కాపరులు, గొర్రెలు కాపరులు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని కలెక్టర్ సూచించారు.

**కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు :**

18, 19 తేదీల్లో భారీ వర్షాల సూచన నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఏదైనా అవసరం ఉన్నా, సమాచారం అందచేయాలన్నా కంట్రోల్ రూమ్ నెంబర్ 08518-277305కు ఫోన్ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## నంద్యాలలో తిరంగా యాత్ర ర్యాలీ : కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ మే 18 :** దేశ సరిహద్దులో త్రివిధ దళాల సైనికులు చేస్తున్న పోరాటం, త్యాగాల వల్లే భారత భూభాగంలో మనందరం ఆనందంగా జీవిస్తున్నామని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డ్ నుండి గాంధీ చౌక్ వరకు నిర్వహించిన భారీ తిరంగా యాత్ర ర్యాలీలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారితో పాటు నంద్యాల పార్లమెంటు సభ్యులు డా. బైరెడ్డి శబరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ పెహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా, ఉగ్రవాదులను అణచడానికి, మన భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఎంతో ధైర్యంతో భారతదేశం ముందడుగు వేసి భారతీయత చాటి ప్రజలే భారతీయత – ప్రజలే దేశమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెలుగెత్తి చాటాయన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి తిరంగా ర్యాలీ ఒక చిహ్నమని, భారతీయతకు ఇదొక నిదర్శనమని కలెక్టర్ తెలిపారు. దేశరక్షణ, సరిహద్దుల రక్షణలో అహర్నిశలు నిమగ్నమైన మన సైనికులకు మనమందరం సంఘీభావం తెలపాలన్నారు. తిరంగా యాత్ర ర్యాలీలో స్వచ్ఛందంగా భాగస్వాములైన ప్రతి ఒక్కరికి కలెక్టర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. నంద్యాల పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ భారత దేశం ధర్మాన్ని నమ్ముకుందని, భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ కు, మన శత్రుదేశాలకు స్పష్టంగా అర్థమయ్యేలా నిరూపించారన్నారు. మన మహిళల సింధూరం తుడిపిన తీవ్రవాదులకు మన మహిళా సైనికుల ద్వారానే గట్టి బుద్ధి చెప్పడం జరిగిందన్నారు. ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా వెతికి వెంట బడి తీవ్రవాదుల తలలు తీసే సత్తా ప్రతి భారతీయుడికి ఉందన్నారు. నంద్యాల టెక్కె మార్కెట్ యార్డ్ నుంచి గాంధీ చౌక్ వరకు భోలో భారత్ మాతాకీ జై, ఉగ్రవాదులు నశించాలి, భారతీయుల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాలతో ఉత్సహంగా సాగింది. మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న సైనికులు, మాజీ సైనికులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆధ్వర్యంలో సన్మానం చేసారు. యుద్ధంలో అసువులు బాసిన అమర జవాన్ మురళీ నాయక్ కు, పహల్గాం మృతులకు వారు సంతాపం తెలిపారు. ఈ తిరంగా ర్యాలీలో మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనారటీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షులు ముస్తాక్ అహమ్మద్, యువనేత ఎన్ ఎం డీ ఫిరోజ్, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్. జి. రామకృష్ణా రెడ్డి, దూదేకుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబన్, సెంట్రల్ సివిల్ సప్లయ్ కమిటీ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, మాజీ సైనికులు, సైనిక కుటుంబాలు, బార్ అసోసియేషన్, నంద్యాల వైద్యుల సంఘం, పలు విద్యాసంస్థల అధినేతలు, అధ్యాపకులు, ఉపాధ్యాయ , ఉద్యోగ, విద్యార్థి, మహిళా, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, ఎన్ సి సి విద్యార్థులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పొలితో ముగిసిన శ్రీ నసనకోట



**అనంతపురం పెన్ పవర్ మే 18 :** ఐదు రోజులపాటు ఎంతో వైభవంగా సాగిన శ్రీ దుర్గమాంబ జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. చివరి రోజు గ్రామ పొలి కార్యక్రమంతో వేడుకలు ముగిసాయి. దాదాపు 64 ఏళ్ల తర్వాత నసనకోట దుర్గమాంబ జాతర మహోత్సవాలు నిర్వహించడం ఇదే తొలిసారి. సుమారు నెలరోజుల పాటు మూడు గ్రామాల ప్రజలు ఎంతో కష్టపడి ఏర్పాట్లు చేశారు. ఐదు రోజులపాటు దుర్గమ్మ, ముత్యాలమ్మ, ఎల్లమ్మ, గంగమ్మ, పోతు రాజుల స్వాములకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.. శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమం కూడా వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు పరిటాల శ్రీరామ్ స్వయంగా దగ్గరుండి ఈ జాతర మహోత్సవాల్ని నిర్వహించారు. ప్రతి కార్యక్రమంలోనూ పరిటాల కుటుంబం పాల్గొంటూ నసనకోట, వెంకటాపురం, గంగంపల్లి గ్రామాల ప్రజలను ఐక్యం చేసి జాతర మహోత్సవాలను నిర్వహించారు. చివరి రోజు గ్రామ పొలి అనంతరం మూడు గ్రామాల్లో విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చాలా ఏళ్ల తర్వాత జాతర మహోత్సవం జరగడంతో ప్రతి ఇంట్లోనూ బంధువుల సందడి కనిపించింది. వెంకటాపురంలో భారీ స్థాయిలో విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్, సిద్దార్థ స్వయంగా అథితులకు భోజనం వడ్డించారు. కర్ణాటకకు చెందిన మాజీ మంత్రి వెంకటరమణప్ప, పావగడ ఎమ్మెల్యే వెంకటేష్ తో పాటు పలువురు ప్రముఖులు కూడా చివరి రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. 800 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న ఆలయ విశిష్టతను తెలిపే విధంగా ఈ జాతర మహోత్సవాలు జరిగాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ అన్నారు. నెలరోజుల పాటు కష్టపడ్డ ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులకు వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇకనుంచి జాతర మహోత్సవాలు తరచుగా జరుగుతుంటాయని వారు వెల్లడించారు. దుర్గమాంబ ఆశీస్సులతో మూడు గ్రామాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.



## హెచ్ఐవితో జీవిస్తున్న వ్యక్తులు పట్ల వివక్షను రూపు మాపాలి



**అనంతపురం పెన్ పవర్ మే 18 :** హెచ్ఐవి తో జీవిస్తున్న వ్యక్తులు పట్ల వివక్షను రూపుమాపాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మరియు జిల్లా నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే ని నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా మే నెల మూడవ ఆదివారం అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే ని నిర్వహించడం జరుగుతోందన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ పై పోరాటంలో అసువులు బాసిన వారిని స్మరించడం, హెచ్ఐవి తో జీవిస్తున్న వ్యక్తులు పట్ల వివక్షను రూపుమాపటం, హెచ్ఐవి సోకే ప్రమాదం ఎక్కువగా ఉన్న సమూహాలైన సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు వంటి వారిపట్ల వివక్షను దూరం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ సంవత్సరం నినాదం "హెచ్ఐవి ఎయిడ్స్ తో చనిపోయిన వారిని మేము గుర్తించుకుంటాం, మేము మాట్లాడతాం, మేము నడిపిస్తాం" అనే నినాదంతో ఈ స్మారక దినాన్ని జరుపుకుంటున్నమన్నారు. జిల్లా సూపర్వైజర్ జి.వి.రమణ మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవి ఎయిడ్స్ తో చనిపోయిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబాలకు మరియు హెచ్ఐవి ఎయిడ్స్ తో జీవిస్తున్న వారికి మేమున్నాము అనే భరోసా ఇవ్వడం ఈ దినం యొక్క ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళి, నారాయణస్వామి, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, రిడ్స్ క్రిష్టప్ప, అనంత నెట్వర్క్ రామాంజనేయులు, రిడ్స్, లింక్ వర్కర్స్ ప్రోగ్రామ్స్ , సిఎస్సి 2.0, పి పి టి సి టి, ఏఆర్టి, ఐసీటీసీ, ఎస్ ఎస్ కే, జిల్లా వైద్యగా ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన 617వ తాళ్లపాక అన్నమాచార్యులు వారి జయంతి వేడుకలు




**తిరుమల పెన్ పవర్ మే 18 :** శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు వారి 617వ జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య కళామందిరంలో సంగీత సభ, హరికథ జరిగింది. తిరుపతికి చెందిన శ్రీ కె.ఉదయభాస్కర్ బృందం ఉదయం 9 గం.లకు సంగీత సభలో "అప్పని వరప్రసాది అన్నమయ్య", "అదివో అల్లదివో శ్రీహరి వాసము" కీర్తనలను ఆలపించారు. ఉ.10.30లకు అన్నమాచార్య ప్రాజెక్టు విశ్రాంత హరికథా భాగవతారిణి జంధ్యాల కృష్ణ కుమారి బృందం "తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత కథ"ను హరికథగా చెప్పారు. అంతకుముందు ఉదయం 8:00 గంటలకు శ్రీ కోదండ రామస్వామి వారి ఆస్థానం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు గోష్టి గానం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు విశ్రాంత గాయకులు కె.వి.విశాలక్ష్మీ బృందం సంగీత సభ జరుగుతుంది. రాత్రి 7 గంటలకు జి.ఎన్.కె.సీతాలక్ష్మీ బృందం హరికథ గానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ సి.లత, అసిస్టెంట్‌లు పి.కృష్ణమూర్తి, కోకిల, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన 617వ తాళ్లపాక అన్నమాచార్యులు వారి జయంతి వేడుకలు

**తిరుమల పెన్ పవర్ మే 18 :** తాళ్లపాక అన్నమాచార్యులు వారి 617వ జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అన్నమాచార్య కళామందిరంలో సంగీత సభ, హరికథ జరిగింది. తిరుపతికి చెందిన శ్రీ కె.ఉదయభాస్కర్ బృందం ఉదయం 9 గం.లకు సంగీత సభలో "అప్పని వరప్రసాది అన్నమయ్య", "అదివో అల్లదివో శ్రీహరి వాసము" కీర్తనలను ఆలపించారు. ఉ.10.30లకు అన్నమాచార్య ప్రాజెక్టు విశ్రాంత హరికథా భాగవతారిణి శ్రీమతి జంధ్యాల కృష్ణ కుమారి బృందం "తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత కథ"ను హరికథగా చెప్పారు. అంతకుముందు ఉదయం 8:00 గంటలకు శ్రీ కోదండ రామస్వామి వారి ఆస్థానం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు గోష్టి గానం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు విశ్రాంత గాయకులు కె.వి.విశాలక్ష్మీ బృందం సంగీత సభ జరుగుతుంది. రాత్రి 7 గంటలకు శ్రీమతి జి.ఎన్.కె.సీతాలక్ష్మీ బృందం హరికథ గానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ సి.లత, అసిస్టెంట్ లు శ్రీ పి.కృష్ణమూర్తి, కోకిల, భక్తులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ



**నంద్యాల, పిన్ పవర్ మే 18 :** 19వ తేదీ సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ప్రజలు ఎవ్వరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని ఉ.9:30 గంటలకు ప్రారంభించి మ.12:30 గం.లలోగా పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే "పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టం" కార్యక్రమానికి ఈ నెల 19వ తేదీ ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడ పిజిఆర్ఎస్ తకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న తగరం గోపాల్‌కు ఆర్థిక సహాయం



**కర్నూలు, పెన్ పవర్ మే 18 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట మేరకు అనారోగ్యంతో బాధపడుతున్న తగరం గోపాల్ కు ఆర్థిక సహాయం చేశారు.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తక్షణ ఆర్థిక సహాయం గా జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా తగరం గోపాల్ కు ఐదు లక్షల రూపాయల చెక్ ను అందచేశారు. శనివారం కర్నూలు నగరంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా దేవనకొండ మండలం నేలతల మర్రి గ్రామ నివాసి తగరం సువర్ణమ్మ తన భర్త తగరం గోపాల్ రక్త సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడని, ఇందుకు సంబంధించి ఇంజెక్షన్లు కు రూ.12 లక్షలు ఖర్చు అవుతుందని వేలూరు సిఎంసి ఆస్పత్రి డాక్టర్లు చెప్పారని, ఆర్థిక సహాయం చేయాలని ముఖ్యమంత్రి కి విన్నవించుకున్నారు..వెంటనే ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సువర్ణమ్మ భర్త వైద్య సేవల నిమిత్తం ఆర్థిక సహాయం అందచేయాలని జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తగరం గోపాల్ తమ్ముని కుమారుడు తగరం దినకర్ కు తక్షణ ఆర్థిక సహాయం గా రూ.5 లక్షల చెక్ ను అందించారు. ఈ సందర్భంగా తగరం సువర్ణమ్మ కుటుంబ సభ్యులు ఆపదలో ఉన్న తమను ముఖ్యమంత్రి ఆదుకున్నారని, వారు చేసిన మేలు మరిచిపోలేని కృతజ్ఞతలు తెలిపారు.. అలాగే చెక్ అందించిన జిల్లా కలెక్టర్ కు కూడా వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉగ్రవాద వ్యతిరేక ఆర్మీ చర్యల్లో ట్రంప్ జోక్యం మన విధానం కాదు

### జూన్ 9 న దేశవ్యాప్త "కార్మిక సమైక్య సమ్మె" జయప్రదం చేయండి : సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్




**మైదుకూరు పెన్ పవర్ మే 18 :** 2025 మే 18వ తేదీన మైదుకూరు స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలోని సిపిఎం కార్యాలయంలో, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం మైదుకూరు పట్టణ కమిటీ కార్య దర్శి షేక్.షరీఫ్ అధ్యక్షతన సిపిఎం సభ్యుల, కార్యకర్తల "విస్తృత సమావేశం" జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ... 2025 ఏప్రిల్ 22 వ తేదీ జమ్మూ కాశ్మీర్లోని పహల్గాం పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అనంతరం, ఉగ్రవాదుల 9 శిబిరాలపై భారత్ ఆర్మీ త్రివిధ దళాల నిర్దిష్ట లక్ష్యాలతో దాడులు సమర్థనీయమని, ఉగ్రవాదులను భారత ప్రభుత్వానికి పాకిస్థాన్ ప్రభుత్వం తక్షణం అప్పగించాలన్నారు. ఉగ్రవాదుల చేతుల్లో పాకిస్తాన్ పాలకులు కీలుబొమ్మ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. పాకిస్తాన్ ప్రేరేపిత పాక్షిక దాడిని ఇండియన్ త్రివిధ దళాలు సమర్థవంతంగా నిర్దిష్ట లక్ష్యాలతో, పాకిస్తాన్ పౌరులకు, అక్కడి పూర సమాజానికి హాని కలిగించకుండా భారత సైన్యం పరిమితి చెందిన ప్రజాస్వామ్యం ఆలోచనతో తిప్పికొట్టాయని, ఉగ్రవాద వ్యతిరేక ఆర్మీ చర్యల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చోక్యం కలిగించుకోవడం మన విదేశాంగ విధానానికి పూర్తి విరుద్ధమన్నారు. నేడు దేశంలో బిజెపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత విభజన రాజకీయాలు చేస్తున్నాయని వాటికి స్వస్తి పలకాలని హితవు పలికారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర బిజెపి క్యాబినెట్ సీనియర్ మంత్రి ఇండియన్ ఆర్మీకి చెందిన మహిళ అధికారి కల్నల్ సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేయటంపై ఆ రాష్ట్ర హైకోర్టు న్యాయస్థానం సియో మోటో గా జోక్యం చేసుకొని, మంత్రి విజయ్ షాపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయమని, ఆ రాష్ట్ర డిజిపి కి ఆదేశించడం జ్యూడిషియల్ యాక్టివిజం కు నిదర్శనం అన్నారు. వెంటనే బిజెపి సీనియర్ మంత్రిని ఆ రాష్ట్ర క్యాబినెట్ నుండి బర్తరఫ్ చేయాలని అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నారని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి, ఎన్డీఏ ప్రభుత్వం స్టార్టప్ ఆర్థిక, పారిశ్రామిక, ఉపాధి విధానం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్రాల చిన్న, మధ్య తరహా పరిశ్రమల డేటా చూస్తే 90% మూతపడ్డాయని ప్రభుత్వ లెక్కలే తెలియజేస్తున్నాయన్నారు. ప్రారంభించిన మొదటి 5 సంవత్సరాల్లోనే 80 శాతం పరిశ్రమలు మూతపడుతున్నాయని ప్రభుత్వ సర్వేలే తెలుపుతున్నాయన్నారు. దశాబ్దం పాటు మనుగడ కొనసాగిస్తున్న పరిశ్రమలు కేవలం దేశంలో 8 శాతమేనని సర్వేలు వెల్లడిస్తున్నాయన్నారు.నిజమైన మార్కెట్ అవసరాలుకు కావలసిన ఉత్పత్తులు తయారీలో విఫలం అవడం, ఆర్థిక, పారిశ్రామిక, మార్కెట్ విధానాల్లో అసమర్ధమైన ఆర్థిక ప్రణాళికలతో ఈ ప్రతికూల ఫలితాలు వచ్చాయన్నారు. ప్రజా నిధుల దుర్వినియోగం కార్యచరణ విఫలం కావడానికి కారణమన్నారు. ప్రజా అనుకూల ఆర్థిక నిపుణుల మార్గదర్శకాలు, వారు చూపుతున్న దారిని నిర్లక్ష్యం చేయడం, ప్రభుత్వం మద్దతు కేవలం ప్రచారం తప్ప ఆచరణ శూన్యం కారణమన్నారు. స్టార్టప్ వైఫల్యానికి మోడీ క్యాబినెట్ బృందం దేశంలోని 250 కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలు అమలుకు తీసుకోవటమే దీనికి కారణం అని ఎద్దేవ చేశారు. సమాచార హక్కు చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, ప్రభుత్వాలు పాలకులు చేస్తున్న దురాగతాలు ప్రజలకు తెలియ కుండా చేస్తున్నారన్నారు. దక్షిణాది రాష్ట్రాలలో దేశ ప్రయోజనాల దృష్ట్యా కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గిందని, ఉత్తరాది రాష్ట్రాల్లో పాటించకపోవడం వల్ల జనాభా పెరుగుతోందని, జనాభా ప్రాతిపదిక ఎం.పీ. సీట్లు నిర్ణయిస్తే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని, తీవ్రమైన ప్రజాసంతృప్తి కేంద్ర ప్రభుత్వం బిజెపి ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జన గణన తో పాటు కుల గణన చేసేటప్పుడు మండల్ కమిషన్ 40 సిఫారసులు పరిగణలోకి తీసుకొని సమగ్రంగా చేయాలని, దేశ ప్రజల్లో పేదరిక కుటుంబాల సంఖ్య శాస్త్రబద్ధంగా, హేతుబద్ధంగా , ఈ సర్వేల వల్ల వెలుగులోకి రావాలన్నది దీని లక్ష్యం అన్నారు. అప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాధనాన్ని, బడ్జెట్ను పేదరిక నిర్మూలన విధానాలు రూపొందించడానికి అమానికంగా ఉపయోగపడతాయన్నారు. న్యాయస్థానాలు ప్రభుత్వాలను ఆదేశించడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో గ్రామీణ పెత్తందారి ధనికవర్గాలు గ్రామీణ యువత చైతన్యాన్ని నిద్రపుచ్చుతున్నాయని దీనికి వ్యతిరేకంగా యువతను చైతన్యం చేసి ఐక్యంగా గ్రామీణ పెత్తందారి ధనిక వర్గాల అరాచకాలను, దుర్మార్గాలను ఎక్కడికి అక్కడే ప్రతిఘటించి, పేద వర్గాలకు రక్షణగా సిపిఎం పార్టీ నిలవాలన్నారు. సిపిఎం 24వ జాతీయ మహాసభలు తమిళనాడులోని మధురైలో జరిగాయని, దేశ ప్రజల ఐక్యత పేద ప్రజల ఈతిబాధల నిర్మూలన సిపిఎం రాజకీయ విధానంగా రూపొందించారని తెలిపారు. ఈ విస్తృత సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు పఠాన్ చాంద్ బాషా, పట్టణ కమిటీ సభ్యులు టి.గురయ్యా, సి.రవి, కే.లక్ష్మయ్య, శాఖా కార్యదర్శులు బాలరాజు, వాసు, సుధాకర్, గంగమ్మ, కామసూ, గురయ్యా, గౌసు, పాంప్లేటి, బి.చాంద్ బాషా, సిపిఎం సభ్యులు హాజరయ్యారు.

## నాగరెడ్డిపల్లిలో శ్రీరాముల ఉత్సవాల్లో భాగంగా జరిగే ఎద్దుల పోటీలను వీక్షించిన ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్





**ముదిగుబ్బ పెన్ పవర్ మే 18 :** ముదిగుబ్బ మండలంలోని నాగరెడ్డిపల్లి గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించిన రాముల గ్రామ ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఎద్దుల పోటీలకు జెండా ఊపి అధికారికంగా ప్రారంభించి, ఉత్సాహంగా వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ పాడిపంటలతో పల్లెలు కళకళలాడాలని ఆకాంక్షిస్తూ జరుపుకునే మొలకల పున్నమి పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ ఎద్దుల పోటీలు మన గ్రామీణ జీవన శైలిని, సాంప్రదాయాలను అద్భుతంగా ప్రతిబింబిస్తున్నాయి. ఈవిధమైన కార్యక్రమాలు గ్రామస్తుల్లో సాంస్కృతిక ఉత్సాహాన్ని పెంపొందించడమే కాకుండా, మన భవిష్యత్ తరాలకు విలువలను చాటి చెప్పే గొప్ప వేదికలుగా నిలుస్తున్నాయి అని తెలిపారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన పందెం ఎద్దులు పోటీలో తమ శక్తి సామర్థ్యాన్ని ప్రదర్శించాయి. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను ఆనందంగా ఆస్వాదించారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని మంత్రి గారికి తమ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు ముదిగుబ్బ జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. యువతీ యువకులు కళలకు ప్రాధాన్యత ఇస్తూ స్వయం ఉపాధిని పొందేలా చర్యలు తీసుకుంటున్నాం. ముదిగుబ్బ మండలానికి 500 టైలరింగ్ మిషన్లు మంజూరు చేయడం జరిగింది. ధర్మవరం నియోజకవర్గం మొత్తానికి 6 శిక్షణా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి అని వివరించారు. టైలరింగ్, డిజైనింగ్ వంటి నైపుణ్యాల ద్వారా మహిళలు తమ ప్రతిభను అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన్ మంత్రి ముద్రా యోజన ద్వారా ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ?33 లక్షల కోట్ల రుణాలు 53 కోట్ల లబ్దిదారులకు అందగా, వీరిలో 95% మహిళలు ఉండటం గర్వకారణమని అన్నారు. ఈ రుణాల ఆధారంగా మహిళలు చిన్నచిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. అలాగే లక్షపతి దీదీ, డ్రోన్ దీదీ వంటి పథకాల ద్వారా మహిళలు వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఆదాయాన్ని పెంచుకుంటున్నారని తెలిపారు. మహిళల ఆత్మవిశ్వాసాన్ని, ఆర్థిక స్వావలంబనను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సేవలలో సమగ్రత, అభివృద్ధిలో సమానత్వం మా లక్ష్యం అని మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ ఎమ్మార్వో నారాయణస్వామి, ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, ఎంపీటీసీ మంజు, ముదిగుబ్బ సర్పంచ్ లక్ష్మీదేవి, నైపుణ్య సిబ్బంది అధికారులు, బిజెపి మండల అధ్యక్షుడు అంజన్ రెడ్డి, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ నాయుడు, టిడిపి మండల కన్వీనర్ ప్రభాకర్ చౌదరి, గడ్డం ఓబిరెడ్డి, కొట్లో బాబీ, బిజెపి మహిళా నాయకురాలు కంచెం లీలావతి, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి గురైన వారిపట్ల ప్రేమా సంఘీభావం తెలపాలి




**ధర్మవరం పెన్ పవర్ మే 18 :** హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి గురైన వారి పట్ల ప్రేమతో కూడిన సంఘీభావం తెలపాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రిక, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై కేతన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ ఎయిడ్స్ స్టాండిల్ లైట్ మెమోరియల్ దినోత్సవం పురస్కరించుకొని చనిపోయిన వారిని గుర్తు చేసుకుంటూ వారి పట్ల ప్రేమ సంఘీభావం తెలియపరిచేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. అనంతరం "అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ దినోత్సవ" ర్యాలీ ను పట్టణ పురవీధులలో నిర్వహించారు. ప్రతి సంవత్సరం 'మే' నెల మూడవ ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం మేము గుర్తించుకుంటాం,మేము మాట్లాడతాం, మేము నడిపిస్తాం అని తెలిపారు. కావున వీరందరికీ మనము సంఘీభావం తెలియజేస్తూ,వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేద్దాం...అని తెలియజేసారు. అదేవిధంగా హెచ్.ఐ.వి సోకి మరణించిన వారిని స్మరించుకొని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని క్యాండిల్ లైట్ డే ను నిర్వహించామని తెలియజేసారు.ఈ సందర్భంగా హెచ్.ఐ.వి సోకిన వ్యక్తులను వివక్షకు గురిచేయరాదని తెలియజేసారు. ఏదో ఒక రోజు హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధికి నివారణ నివారణ/ నియంత్రణ వస్తుందని అదే విధముగా ఈ వ్యాధి సోకిన వారు ఎవరైనా సరే దృఢంగా ఉండాలని ఆశిస్తూ... హెచ్.ఐ.వి. పాజిటివ్ వ్యక్తుల పట్ల , హెచ్.ఐ.వి. విభాగంలో పనిచేయు ఉద్యోగుల పట్ల వివక్షత చూపకుండా ఉండాలని తెలిపారు. మా విన్నపము. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి కాలేజీ సర్కిల్ వరకు కొవ్వొత్తుల తో ర్యాలీ నిర్వహించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలోమెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రిక ఐ సి టి సి కౌన్సెలర్ వనమాల, ల్యాబ్ టెక్నీషియన్ భార్గవి ,టిబియూనిట్ బాషా, శక్తి మైత్రి మహిళా సంఘం ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణమ్మ, వైద్య వైద్య సిబ్బంది ,యువర్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పోలా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 19వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

అనంతపురం, పెన్ పవర్ మే 18 : ఈనెల 19వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పలమనేరు బాలాజీ ఏకలవ్య కాలనీ కథలకు సడ్లపల్లె సాహిత్య పురస్కారం




**పలమనేరు మే 18, (పెన్ పవర్) :** ప్రముఖ కవి,రచయిత, విమర్శకుడు పలమనేరు బాలాజి రాసిన ఏకలవ్య కాలనీ కథా సంపుటికి సడ్లపల్లె సాహిత్య పురస్కారం 2025 కు ఎంపికయ్యిందని హిందూపురానికి చెందిన ఆ సంస్థ నిర్వాహకులు సడ్లపల్లె చిదంబర రెడ్డి సమాచారం అందించారు. తమ ఊరి పేరునే ఇంటి పేరుగా మార్చుకొని కథ కవిత్వం నవల విమర్శ ప్రక్రియల్లో 1991సంవత్సరం నుండీ కృషి చేస్తున్న పలమనేరు బాలాజీ తెలుగు సాహిత్యంలో తొలిసారిగా ఎరుకల జీవన గాథలను ఏకలవ్య కాలనీ పేరిట కథల పుస్తకంగా 2024 డిసెంబరు లో వెలువరించారు.ఈ పుస్తకానికి ఇటీవలే కెనడా తెలుగుతల్లి సాహిత్య పురస్కారంతో పాటు గీతాంజలి స్మారక సాహిత్య పురస్కారం కూడా అందుకున్నారు. నియోజకవర్గ పరిధిలో ని పెద్దపంజాణి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న బాలాజీ ఇప్పటికి నాలుగు కథా సంపుటాలను,మూడు కవితా సంపుటాలను, నవలను వెలువరించారు. కేంద్రసాహిత్య అకాడమీ ఆహ్వానంపై జాతీయస్థాయిలో తెలుగు భాషా ప్రతినిధిగా శాంతినికేతన్‌కు వారం రోజులపాటు అతిథిగా వెళ్లి వచ్చారు.ఆయన కవిత్వం కన్నడ, మలయాళం,తుళు, ఆంగ్ల,తమిళ భాషల్లో కూడా అనువాదం చెందింది.కథలు, కవిత్వం కన్నడ,ఆంగ్ల భాషల్లో అనువాదం చెంది పుస్తకాలుగా వెలువడ్డాయి.తన రచనలకు స్మైల్ పురస్కారం,తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం,కందుకూరి వీరేశలింగం పంతులు స్మారక పురస్కారం, నూతలపాటి గంగాధరం సాహిత్య పురస్కారం,మాడభూషి రంగాచార్య స్మారక కథాపురస్కారం,గీతాంజలి స్మారక పురస్కారం,కెనడా తెలుగుతల్లి సాహిత్య పురస్కారం,కామాక్షి బాయి నారాయణ రావు సాహితీ పురస్కారం అందుకున్నారు.ఇలా అనేక జాతీయ అంతర్జాతీయ సాహిత్య సదస్సులలో, కవి సమ్మేళనాలలో తెలుగు భాషా ప్రతినిధిగా బాలాజి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీద రెండు పర్యాయాలు రాష్ట్ర తెలుగు భాషా పురస్కారాన్ని అందుకున్నారు.ఆయన రచించిన రచనలపై తెలుగు విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి.కేంద్ర సాహిత్య అకాడమీ ద్వారా కవి సంధి కార్యక్రమం ద్వారా అంతర్జాలంలో జాతీయస్థాయిలో తన కవిత్వాన్ని వినిపించారు.ఢిల్లీలో జరిగిన జాతీయ తెలుగుకవితా సదస్సులో పాల్గొని తన కవిత్వాన్ని దేశ రాజధానిలో వినిపించారు. కాగా పలమనేరు బాలాజీకి సడ్లపల్లె సాహిత్య పురస్కారం లభించడం పట్ల స్థానిక రచయితలు కవులు సాహిత్య సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## మే 19న జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ : జిల్లా కలెక్టర్



**చిత్తూరు, పెన్ పవర్ మే 17 :** మే 19 వ తేదీన సోమవారం చిత్తూరు కలెక్టరేట్ లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ను ఉ.9.30 గం.ల నుండి మ.1 గం.వరకు కలెక్టరేట్ లోని సమావేశపు మందిరం నందు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉ.9 గం.కల్లా తప్పక హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీని తో పాటు నియోజక వర్గ,మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

## వ్యవసాయ కూలీలకు భూ పంపిణీ చేయండి




**శ్రీకాళహస్తి/ పెన్ పవర్/ ప్రతినిధి/ మే 18 :** వ్యవసాయ పనులకు భూ పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వందవాసి నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వామపక్షాల కృషితో నాడు అమలు చేస్తే,, నేడు అధికారంలోకి వచ్చిన బిజెపి క్రమంగా బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. తక్షణమే గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు పెంచి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి రోజుకు 600 రూపాయల వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద రైతుల నుండి ప్రభుత్వ ప్రైవేటు కార్పొరేట్ కంపెనీల అవసరాల కొరకు భూసేకరణ చేస్తున్న ప్రభుత్వం, భూమిలేని వ్యవసాయ కూలీలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయడంలో కాలయాపన చేస్తుందంటూ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, ఉపాధ్యక్షులు రాజగోపాల్, రమణయ్య కార్యదర్శులు శంకరయ్య, జిల్లా కమిటీ సభ్యులు సుబ్బమ్మ,, ముని శంకర్, రామచంద్రారెడ్డి, అముదా, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కడప యువతకు మార్గదర్శిగా " పి4 స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్"

### సోమవారం శంఖుస్థాపన చేయనున్న జిల్లా ఇంచార్జి మంత్రి సవిత

### రూ.10 కోట్ల అంచనాతో నిర్మించనున్న పి4 స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్ : జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి



**కడప, పెన్ పవర్ మే 18 :** పారిశ్రామిక ప్రగతికి, యువతలో ఆవిష్కరణకు, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించబడిన "స్టార్టప్ కడప ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్" నిర్మాణానికి శంఖుస్థాపన జరగనుంది. ఈ కేంద్రాన్ని కడప ఆర్ట్స్ కాలేజ్ సమీపంలో సోమవారం జిల్లా ఇంచార్జి మంత్రి సవిత శంఖుస్థాపన చేయనున్నారని, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రం యువ స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల అభివృద్ధికి పునాది వేస్తూ, కడపను వ్యాపార అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక పాత్ర పోషించనుంది. దేశ, విదేశాల్లో స్థిరపడిన కడప జిల్లా వాసుల సహకారంతో, వారిని అనుసంధానం చేసుకుని ఈ స్టార్ట్ అప్ హబ్ ను ముందుకు తీసుకువెళ్తామన్నారు.

ప్రాజెక్ట్ లక్ష్యాలు:

స్టార్టప్ కడప కేంద్రం ఆవిష్కరణను ప్రోత్సహించడమే కాక, ఆలోచనల నుంచి అభివృద్ధి చెందిన వ్యాపారాల వరకు అన్ని దశల్లో స్టార్టప్‌లకు మద్దతు అందించేందుకు రూపొందించబడింది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వృత్తిపరమైన వర్క్‌స్పేస్‌లు, సహకార వాతావరణం వంటి అంశాలతో యువతకు అవసరమైన అన్ని వనరులు ఈ కేంద్రం అందించనుంది.

నిర్మాణ వివరాలు:

జి+౦3 అంతస్తులు, 25,000 చదరపు అడుగుల విస్తీర్ణం

PEB టెక్నాలజీ ఆధారంగా నిర్మాణం

పార్కింగ్ మరియు ప్రవేశ వసతులు:

25-30 కార్లకు పార్కింగ్, ద్విచక్ర వాహనాల కోసం ప్రత్యేక స్థలాలు

ల్యాండ్‌స్కేప్డ్ డ్రైవ్‌వే, లా

భవన వినియోగ ప్రణాళిక

గ్రౌండ్ ఫ్లోర్: డబుల్ హైట్ లాబీ, రిసెప్షన్, వేచి ఉండే ప్రదేశం, 200 సీట్ల ఆడిటోరియం, క్యాఫెటీరియా

మొదటి అంతస్తు: కాన్ఫరెన్స్ హాల్స్, మీటింగ్ రూములు, శిక్షణ గదులు

రెండవ, మూడవ అంతస్తులు: ఓపెన్ వర్క్‌స్టేషన్లు, ప్రైవేట్ గ్లాస్ కేబిన్లు, ఐడియా పాడ్లు, ఇన్‌ఫార్మల్ లౌంజ్‌లు, బ్రేక్‌ఔట్ జోన్లు

మౌలిక సదుపాయాలు:

ట్విన్ లిఫ్ట్ కోర్, ఎనర్జీ ఎఫిషియెంట్ %ఎూాజ

సోలార్ రూఫ్‌కు అనుకూలత

వేగవంతమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ

పచ్చదనం, నీడలతో కూడిన వాక్‌వేలు, సురక్షిత సైట్ అభివృద్ధి

ప్రాజెక్ట్ మొత్తం వ్యయం:

ఈ ప్రాజెక్టును రూ. 10 కోట్లు అంచనా వ్యయంతో నిర్మించబడింది. షిర్డీసాయి ఏక్ట్రికల్స్ రూ.4 కోట్లు విరాళం అందించారు. ఇందులో సివిల్ నిర్మాణం, ఫినిషింగ్ పనులు, HVAC, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వ్యవస్థలు, మరియు సైట్ అభివృద్ధి వ్యయాలు ఉన్నాయి. "స్టార్టప్ కడప" కేవలం ఒక భవనం మాత్రమే కాదు- ఇది యువత కలలకు రూపురేఖలు ఇచ్చే వేదిక. ఆవిష్కరణ, ఆధునికత, అభివృద్ధికి దిక్సూచిగా ఇది నిలవనుంది. కడపను పారిశ్రామిక, సాంకేతిక దిశలో ముందుకు నడిపించేందుకు ఇది ఒక మంచి ప్రాజెక్ట్ అని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# శ్రీశైలం నిత్య అన్నదాన సత్రం కమిటీ నియామకం



**శ్రీకాళహస్తి / పెన్ పవర్/ ప్రతినిధి/ మే18 :** రాయలసీమ అగ్నివన్నీ కుల క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి సన్ని ధానంలో నూతనంగా నిర్మించబోయే నిత్య అన్నదాన సత్రం కమిటీని ప్రకటించారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి నుంచి శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి, నియమిస్తున్నట్లు రాయల సీమ రాష్ట్ర అగ్ని వన్నెకుల క్షత్రియ అధ్యక్షులు బలరామిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్లెంబాకం మునికృష్ణారెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం లో భక్తుల సౌకర్యార్థం నిర్మించబోయే నిత్య అన్నదాన సత్రం కమిటీ లో శ్రీకాళహస్తి నియోజవర్గం నుంచి మమ్మల్ని ఎంపిక చేయటం చాలా సంతోషంగా ఉందని దానికి అనుగుణంగా మా వంతు సహాయ సహకారాలతో పాటు నిత్య అన్నదాన సత్ర నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజవర్గం నుంచి మప్పేటి నాదముని రెడ్డి, ఏర్పేడు మండలం నుంచి జయశంకర్ రెడ్డి ,మునస్వామి రెడ్డిలను కూడా ఎంపిక చేయటం హర్షించదగ్గ విషయమని తెలిపారు.


# ఈ నెల 20న జాబ్ మేళా

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మే 18 :** జిల్లా ఉపాధి కార్యాలయం, ఒంగోలు వారి ఆధ్వర్యంలో కే.ఎ.ల్ గ్రూప్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, శ్రీ చక్ర హుండాయ్ కంపెనీ లో పికింగ్, ప్యాకింగ్, స్టొయింగ్, సార్టింగ్, లోడింగ్, ప్రమోటర్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్ సెక్టార్ లలో వివిధ రకాల ఖాళీలను భర్తీచేయుటకు ఈ నెల 20 వ తేదీన (మంగళవారం) ఉదయం 10:00 గం.ల నుండి సాయంత్రం 3గం.ల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి. భరద్వాజ్ తెలియజేశారు. ఏదైనా విభాగంలో ఐ.టి.ఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ చదువులు పూర్తి చేసిన వారికి ఇంటర్వ్యూ లు జిల్లా ఉపాధి కార్యాలయం, ఒంగోలు నందు ఈ నెల 20 వ తేదీన (మంగళవారం) ఉదయం 10:00 గం.ల నుండి సాయంత్రం 3గం.ల వరకు నిర్వహిస్తున్నట్లు ఇంటర్వ్యూ లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు జీతం నెలకు 10,000/- నుండి 19,000/- వరకు ప్లస్ పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకం ఇవ్వటం జరుగుతుందని ఆయన తెలిపారు. కావున జిల్లాలోని 18సం, నుండి 29 సం,మధ్య గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఇంటర్వ్యూ కు ఆధార్ కార్డు, సరిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరములకు https://forms.gle/wnfddgAQGrLSRwgq9 లేదా ఆఫీసు పని సమయాలు 08592 281776 లను సంప్రదించాలన్నారు.

# రాజయోగమనే ప్రత్యేక యోగవిధానం

### సహజమార్గంలోని గొప్పతనము.. సేకరణ రాచమోహన్ శ్రీరామచంద్ర మిషన్ కడప.

**కడప పెన్ పవర్ మే 18 :** రాజయోగపద్ధతిలో శక్తులకోసం సాధన చేయరు. దీని ఉద్దేశ్యం తననుతాను సాధ్యమైనంత అత్యున్నతస్థాయి వరకు వికసింపజేసు కోవడమే. దీనినే గురుదేవులు ఆత్మసాక్షాత్కారం,దివ్యీకరణ అనేవారు. దీనిని మానవపరిపూర్ణతగా నిర్వచిం చారు వారు.సహజమార్గంలోని సహజత్వం ఇక్కడ కనిపిస్తుంది. ఈపద్ధతిలో ఎటువంటి రూపాలను, నామాలను వాడము.హృదయం మీద ధ్యానం చేస్తాము. శక్తుల కొరకు ఎటువంటి అభ్యర్థనలు, ప్రార్థనలు ఉండవు.ఎందుకంటే ఆధ్యాత్మిక ప్రగతికి, పురోగతికి శక్తులవసరం లేదు.



**(37)శక్తులు:** గురుదేవులు బోధించినట్లు మనము ఆధ్యాత్మికంగా ఎదుగుతున్న కొద్దీ మనస్సు,హృదయము పరిశుద్ధమై,పరిపూర్ణమైనప్పుడు, ప్రకృతే తనలోని శక్తుల భాండాగారాన్ని మనకోసం తెరిచి ఉంచుతుంది. అటువంటి వ్యక్తికి విశ్వంలోని శక్తులన్నీ అందుబాటులో ఉంటాయి.అది అతని శక్తి కాదు.పరిస్థితుల అవసరాన్ని బట్టి ఎటువంటి శక్తినైనా అతడు ఉపయోగించగలడు.అయితే ఆవ్యక్తికి కూడా ఆధ్యాత్మిక పురోగతికి ఈ శక్తుల వసరం లేదు.అటువంటి వ్యక్తి యోగిగా, దివ్యీకరణ చెందిన వ్యక్తిగా మారినప్పుడు ప్రకృతి కార్యంలో మాధ్యమంగా ఉంటాడు. ప్రకృతికి ప్రతినిధిగా ఉంటాడు. అందుచేతనే ప్రకృతి తన శక్తులను అతనిచేత చేయని స్తుంది. అటువంటి వ్యక్తి తాను ఆ శక్తులను ఉపయోగిస్తున్నాడనే ఎరుక కూడా కలిగియుండడని గురుదేవులు చెప్పారు.ఇదే అతనికి రక్షణ కవచంగా ఉంటుంది. ఎందు కంటే మనకు శక్తులున్నాయని గాని, శక్తులను ఉపయోగిస్తున్నామనిగాని,స్పృహ ఉంటే మనకు గర్వం, అహంకారము రెండూ అలవడతాయి.ఈరెండూ ఆ వ్యక్తిని అధోగతికి నెట్టివేస్తాయి." శక్తి మనిషిని నాశనం చేస్తుంది. సంపూర్ణశక్తి సంపూర్ణంగా నాశనం చేస్తుంది.మన వికాసానికి మనలను మనమే వినియోగించుకుంటాం తప్ప మరింకేమి కాదు. అంటే మనం మనమీదే కృషిచేసుకుంటాం. మనకోసమే చేసుకుంటాం.మనమే చేసుకుంటాం.సహజమార్గంలోని గొప్పతనం ఇక్కడే ప్రస్ఫుటమవుతుంది.

# గూడూరు ఎమ్మెల్యే చేతుల మీదగా మెగా జాబ్ మేళా పోస్టర్



**తిరుపతి పెన్ పవర్ మే 18 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆధ్వర్యంలో మరియు డాక్టర్ పాశం సునీల్ కుమార్ గారు, గౌరవ శాసనసభ్యులు, గూడూరు నియోజకవర్గం, డి ఆర్ డబ్ల్యు డిగ్రీ కాలేజ్, LAQSH (లక్ష్) ఫౌండేషన్ సహాయ సహకారంతో, 20-05-2025 తేదీన అనగా ఈ మంగళవారం, ఉదయం 8 గంటల నుంచి గూడూరు లోని డి ఆర్ డబ్ల్యు డిగ్రీ కళాశాల (DRW Degree College, Gudur) నందు మెగా జాబ్ మేళా నిర్వహించబడును. ఈరోజు ముఖ్య అతిథులుగా గౌరవ ఎమ్మెల్యే చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ జరిగినది ఈ కార్యక్రమంలో భాగంగా Dr పాశం సునీల్ కుమార్, శాసనసభ్యులు, గూడూరు నియోజకవర్గం వారు మాట్లాడుతూ, ఈ మెగా జాబ్ మేళాలో చదువుకుని ఖాళీగా ఉన్నటువంటి నిరుద్యోగ యువత కోసం,శ్రీ సిటీ, మేనకూరు సెజ్ , ఈఎంసి క్లస్టర్, తిరుపతి, మరియు చెన్నైలోని 21 బహుళ జాతీయ కంపెనీలలో 900 పైగా ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడును. కావున ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఐదవ తరగతి పైన పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ లేదా ఐటిఐ లేదా డిప్లమా లేదా ఏదైనా డిగ్రీలో లేదా పీజీలో ఉత్తీర్ణత అయిన యువతి యువకులు ఈ మెగాజాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని వారు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు క్రింద తెలుపబడిన రిజిస్ట్రేషన్ లింక్ లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవలెను మరిన్ని వివరాలకు క్రింద తెలుపబడిన మొబైల్ నెంబర్లను సంప్రదించగలరు.

# వేసవి లో తీర్ధ యాత్రలకు వెళ్ళే వారికోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి




**తిరుపతి పెన్ పవర్ మే 18 :** తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ఈ నెల 22వ తేదీ నుండి జులై 13వ తేదీ వరకు మూడు ప్యాకేజీలుగా ప్రత్యేక రైళ్లను హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నట్లు IRCTC టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ DSGP కిషోర్ గారు ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్యాకేజీ 1: (దివ్య దక్షిణ యాత్ర తో జ్యోతిర్లింగం-SCZBG42) ఈ యాత్రలో అరుణాచలం / రామేశ్వరం / మధురై / కన్యాకుమారి / త్రివేండ్రం / తిరుచ్చి / తంజావూరు ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర మే 22వ తేదీన ప్రారంభమై 30వ తేదీ వరకు ఉంట్టుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 14700, 3 ఏసీ ధర 22900, 2 ఏసీ ధర 29900 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ ,భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా వెళ్తుంది. ప్యాకేజీ 2: (గంగా రామాయణ పుణ్య క్షేత్ర యాత్ర-SCZB+44) : ఈ యాత్రలో (కాశీ)వారణాసి / అయోధ్య / నైమిశారణ్య / ప్రయాగరాజ్ / శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర జూన్ 14 వ తేదీన ప్రారంభమై 22 వ తేదీ వరకు ఉంట్టుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 16200, 3 ఏసీ ధర 26500, 2 ఏసీ ధర 35000 ఉంటుంది. . ఈ యాత్ర సికింద్రాబాద్ భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం,పలాస, బరంపూర్,భువనేశ్వర్ మీదుగావెళ్తుంది.

ప్యాకేజీ 3: (ఐదు జ్యోతిర్లింగ యాత్ర- SCZB+43 ఉజ్జయిని (మహాకాళేశ్వర్-ఓంకారేశ్వర్)-త్రయంబకేశ్వర్ - భీమశంకర్-ఘృష్ణేశ్వర్). ఈ యాత్రలో మహాకాళేశ్వర్ / ఓంకారేశ్వర్ /త్రయంబకేశ్వర్ / భీంశంకర్ / ఘృష్ణేశ్వర్ / ఎల్లోరా / మోవ్/ నాగ్పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. ఈ యాత్ర జులై 05 వ తేదీన ప్రారంభమై 13 వ తేదీ వరకు ఉంట్టుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 14700, 3 ఏసీ ధర 22900, 2 ఏసీ ధర 29900 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ కామారెడ్డి నిజామాబాద్ ధర్మాబాద్ నాందేడ్ ముధ?డ్ మరియు పూర్ణ మీదుగా వెళ్తుంది

సౌకర్యాలు: రైలు, బస్సు, హొటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం మరియు రాత్రి భోజనం), వాటర్ బాటిల్ మరియు టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా అలాగే రైల్వే స్టేషన్ నుండి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగ ఉచితం. ప్రతి రైలు లో 718 మంది ప్రయాణికులు ఉంటారు. ప్రతి 70 మందికి ఇద్దరు కోర్డినెటర్లు అందుబాటులో ఉండి అన్ని సావకార్యాలు సమకురుస్తారు. కోచ్ కి ఒక సెక్యూరిటీ గార్డ్ అలాగే రైలు లో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలియజేశారు. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు 9701360701,9281030712,9281030749,9281030750,9281030740 లకు సంప్రదించాలని. మరిన్ని వివరణలకు www.irctctourism.com వెబ్సైట్ ని సంప్రధించాలని తెలిపారు.

# అంతర్జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ



**తిరుపతి, పెన్ పవర్ మే 18:** అంతర్జాతీయ ఎయిడ్స్ దీప స్మృత్యంజలి 2025 లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, పథక సంచాలకులు వారి ఆదేశానుసారం, జిల్లావైద్య ఆరోగ్యఅధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆధ్వ ర్యంలో నిర్వహించడం జరిగింది. హెచ్ఐవి/ఎయిడ్స్ ద్వారా నేటి వరకు ప్రపంచ వ్యాప్తంగా 38 మిలియన్ ప్రజలు ఎవరైతే మరణించారో వారిని స్మరించుకుంటూ, వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగా లని 1983వ సంవత్సరం నుండి మే మూడవ ఆదివారం నిర్వహించడం జరుగుతోంది. ఈ సంవత్సరం2025 హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధితో చనిపోయిన వారిని, మేము గుర్తించు కుంటాం, మేము మాట్లాడతాం, మేము నడిపిస్తాం, అనే నినాదంతో జరుపుకోవడం జరిగింది. ప్రతి ఒక్కరూ హెచ్ఐవి ఎయిడ్స్ బారిన పడిన వారిపట్ల ఎటువంటి వివక్ష చూపరాదని, ఎలాంటి వివక్ష భావనలు ఉండరాదని రాబోయే భావితరాలకు సందేశం ఇవ్వడం జరిగింది. వీటికి విరుద్ధంగా వ్యవహరించినటువంటి వారు 2017 ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారని తెలపడం జరిగింది. ఈ కార్యక్ర మంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎయిడ్స్ విభాగం డాక్టర్ మురళి, దిశా క్లస్టర్ ప్రాజెక్ట్ మేనేజర్ కోటిరెడ్డి,అకౌంటెంట్ పుల్లయ్య, ఇతర ప్రభుత్వ అధికా రులు, నర్సింగ్ విద్యార్థినులు, ఐసిటిసి, ఏఆర్‌టి సిబ్బంది, విహాన్, పాస్, ఎల్ డబ్ల్యూ ఎస్, గ్రాసం స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది ప్రజలు పాల్గొనడం జరిగింది.



# రాష్ట్ర గవర్నర్ కలసిన మంత్రి సవితమ్మ



**అనంతపురం పెన్ పవర్ మే 18 :** అనంతపురం జెఎన్టీయులో జరుగుతున్న స్నాతకోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి అనంతపురం పట్టణంలోని ఆర్ & బి అతిథి గృహం నందు మర్యాద పూర్వకంగా కలసిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు శ్రీమతి సవితమ్మ.

# మన ఇండియన్ నెల్లూరు రెడ్డి.. సతీష్ రెడ్డి పవర్....



**నెల్లూరు పెన్ పవర్ మే 18 :** ఏ హైపో సోనిక్ విమానాలు చూపెట్టి అమెరికా ప్రపంచాన్ని భయ పెడుతుందో.... చైనా మన మీదకు మాటి మాటికి కాలు దువ్వుతుందో. గాలి కంటే ఆరు రెట్ల వేగం అంటే సెకనుకు రెండు కిలో మీటర్లు.... నిమిషానికి నూట ఇరవై కిలో మీటర్ల వేగంతో ప్రయాణించే హైపోసోనిక్ మిసైళ్లను స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసి అగ్రరాజ్యాలకు సవాలు విసిరాడు.. మన తెలుగోడు. నెల్లూరుకు చెందిన గంద్రా సతీష్ రెడ్డి ఇది హీరోయిజం అంటె... గౌరవం ఇవ్వాలిసింది కరెన్సీ కోసం కెమెరా ముందు కులికే నటులకో సెంచరీలు కొట్టే క్రికెటర్లకో కాదు. తొడగొట్టి రైలు ఆపి దూపులతో వందమందిని చితకొట్టే యాక్టర్లకు కాదు. యాడ్ రెమ్యూనేషన్ పెంచుకునేందుకు సెంచరీలు చేసే క్రికెటర్లకు కాదు. హీరోలంటే శత్రుదేశం మనవైపు చూడాలంటేనే వెన్నులో వణుకు పుట్టించే సైంటిస్ట్ సతీష్ రెడ్డి లాంటి వాళ్ళు అసలు హీరోలు. మన అభిమానానికి అర్థం పరమార్థం ఉండాలి. వీళ్లు మన అభిమాన హీరోలు అంటే... ఇలాంటి హీరోను కన్న వారి తల్లికి పాదాభిషేకం చెయ్యాలి. ఇది నా భారత భూమి, ఈ దేశంలో ఉన్న మహాను భావుడు సతీష్ రెడ్డికి పాదాభివందనం దయచేసి మిత్రులకు మనవి ఏమనగా ఈ హీరో గురించి ఎంత చెప్పినా తక్కువే, మీరు ఈ మెసేజ్.

## సి. క్యాంపు రైతు బజార్‌ను ఉత్తమ రైతు బజార్‌గా అభివృద్ధి చేస్తాం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**కర్నూలు, పెన్ పవర్ మే 17 :** సి. క్యాంపు రైతు బజార్‌ను ఉత్తమ రైతు బజార్‌గా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి సి క్యాంప్ రైతుబజార్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పారిశుద్ధ్య కార్మికులు అయ్యమ్మ, వెంకటేష్ లతో మాట్లాడారు. వారి కుటుంబ వివరాలు, యోగక్షేమాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.. అక్కడే ఉన్న కూరగాయలు, పండ్లు,పూలు అమ్ముకునే రైతులతో మాట్లాడుతూ ఎన్ని ఎకరాల పొలం ఉంది, రోజుకు ఎంత వ్యాపారం జరుగుతుంది,సంవత్సరానికి ఆదాయం ఎంత వస్తుంది, అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కీరా దోస కొనుగోలు చేసి, డబ్బు చెల్లించారు..ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాన్ని ముఖ్యమంత్రి పరిశీలించి ప్రతి రైతు బజార్లో ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. బయో డైజెస్టర్ యంత్రం ద్వారా కూరగాయల వ్యర్థాలను ప్రాసెస్ చేసి ఎరువులు ఏ విధంగా తయారు చేస్తారు అని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.. అలాగే టాయిలెట్ లను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, రైతు బజార్ సీఈఓ మాధవి లత, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మార్కెటింగ్ శాఖ జెడి రామాంజనేయులు ,డిడి శ్రీకాంత్ రెడ్డి, ఏడి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ల బైక్ రైడింగ్ పై యువతకు కౌన్సెలింగ్



**పలమనేరు మే 17, పెన్ పవర్ :** పట్టణంలో పోలీసు స్టేషన్ వద్ద ఆదివారం మైనర్ల బైక్ రైడింగ్‌పై సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహరాజు మరియు ఎస్ఐ స్వర్ణతేజల ఆధ్వర్యంలో యువతకు కౌన్సెలింగ్ నిర్వహించారు.18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న యువతకు భారతీయ మోటార్ వాహన చట్టం 1988 ప్రకారం వాహనాలు నడపడం నిషేధమన్నారు. కానీ ఆచరణలో చాలా మంది యువత ఈ నియమాలను ఉల్లంఘిస్తు న్నారని, తద్వారా ఇది చాలా ప్రమాదాలు మరియు చట్టపరమైన పరిణామాలకు దారి తీస్తుందన్నారు.వాహనాలు నడపాలంటే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరని,18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు డ్రైవింగ్ లైసెన్స్ పొందలేరని అన్నారు.అలా కాకుండా ఎవరైనా తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే దాదాపు 25వేల రూపాయలు వరకు ఫైన్ విధించవచ్చని, అలాగే వాహనాన్ని కూడా సీజ్ చేయడంతో బాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకొంటామని ఆయన హెచ్చరించారు.

# విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**కావలి పెన్ పవర్, మే 18 :** కావలి పట్టణంలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ఆదివారం పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. శృంగేరి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విదుశేఖర భారతి నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. అనంతరం విధుశేఖర భారతి ఆశీర్వాదాలు ఎమ్మెల్యే తీసుకున్నారు.

# రాచర్ల, గిద్దలూరులలో భారీ వర్షం

### రాచర్ల లో 37.6 మీమీలు, గిద్దలూరులో 34.2 మీ మీలు.. రాచర్ల లో పిడుగులు 22 గొర్రెల మృతి 3లక్షలు నష్టం







**గిద్దలూరు పెన్ పవర్ మే 18 :** గిద్దలూరు , రాచర్ల మండలాల్లో శనివారం సాయంత్రం నుండి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా రాచర్ల లో 37.6 మీ మీ లవర్షం కురవగా ,గిద్దలూరు లో 34 .6 మీమీ ల వర్షం కురిసింది. దీంతో పంటపొలాలు బాగా పదునై పంటలు వేసేందుకు సిద్ధమయ్యాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తుండగా, మరోప్రక్క ఈ ఆకాలవర్షాలు పలువురిని ఇబ్బందుల పాల్జేస్తున్నాయి. శనివారంనాడు భారీ ఈదురుగాలులతో, పెళ్లపెళ్ల ఉరుములు మెరుపులు తోసాగిన వర్షం రాచర్ల మండలంలో పిడుగులు పడి ముగ్గురు పశు యజమానులను విషాదంలో ముంచేశాయి. పిడుగు పాటుకు నలమల్ల అటవీప్రాంతంలో మేతకు వెళ్లిన గొర్రెలు 22 ఏక కాలంలో మృత్యువాత పడి షుమారు 3లక్షల రూపాయల నష్టమ వాటిల్లటం తో పశుపోషకులు లబోదిబో మంటున్నారు. జె పి చెరువు గ్రామానికి చెందిన ఒంటేరు రంగాయకు చెందిన 12 గోర్లు, పాలమూరు శ్రీనివాసులుకు చెందిన 5 గోతం ఖాసీం వలికి చెందిన 5 గొర్రెలను సమీపంలో ని నలమల్ల ఆటవిలోకి రోజుటి మాదిరిగానే మేతకు టోలుకెళ్లారు , మేత మేస్తుండగా సాయంత్రం సమయానికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై , భారీ ఈదురుగాలులతో, ఉరుములు ,మెరుపులతో భారీ వర్షం కురిసింది. గొర్లను అడవి నుంచి బయటకు తొలుకొచ్చే సమయం కుడాలేకపోవటంతో గొర్రెలను ఒక ప్రక్క తోలి కాపరులు చెట్ల మాటున తలదాచుకున్నారు. అదేసమయం లో భారిశాబ్దాలతో ఒక్కసారిగా పిడుగు పడింది.దీంతో 22 గొర్రెలు ఒక్కసారిగా మృత్యువాత పడ్డాయి కాపరులు కొద్దీ దూరంలో ఉండ టంతో ప్రాణాలతో బయటపడ్డారు. 22 గొర్ల విలువ షుమారు 3 లక్షల రూపాయలు ఉంటాయని గొర్ల యజమానులు వాపోతున్నారు. కండ్ల ముందే జీవాలు మృత్యువాత పడ్డాయని తమ ఆరుగాలం కష్టం వృధా అయిందని వారు వాపోయారు. ఇదిలా ఉండగా శనివారం కావటంతో నెమలిగుండ్ల రంగనాయక స్వామి ని దర్శించుకొని మొక్కులు చెల్లించేందుకు భక్తులు నెమలిగుండం వెళ్లారు. అయితే వర్షం, గాలులకు ఉరుములకు అడవిలో భయకంపితులయ్యారు. నలమల్ల అడవిలో వర్షం భారీగా కురవడం మూలంగా గుండ్లకమ్మ పొంగి కొండపైనుండి భీకరంగా జాలువారి గొండంలో పడి వాగు పారటంతో నెమలిగుండం మార్గం నీటిలో మునిగింది దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి భక్తులు తిరిగి రాలేక ఆవాలివైపు ఉండి పోయారు, కాకుండా ఈమార్గం లోనే భారీ వృక్షాలు రోడ్డుకడ్డంగా కూలాయి ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు, సిబ్బంది తో సంఘటనా స్థలానికి హుటాహుటిన వెళ్లి రోడ్డుకు అడ్డంగా పడినచెట్లను తొలగించి, భక్తులను ట్రాక్టర్ల ద్వారా సురక్షితంగా నదిని దాటించారు. ఇక గిద్ద లూరులో 32.2 మీ మీలవర్షం కురిసి పల్లపు ప్రాంతాలన్నీ జలమయ మయ్యాయి. డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేక పోవడం మూలంగా రోడ్లపై మోకాలి లోతు నీరు పారాయి. కొందరు పొగాకు రైతులు నష్టపోయారు. గిద్దలూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలో బెస్తవారిపేట లో 1.4 మీమీలు అర్ధవీడులో 1.8,కోమరోలు 3.2 కంభం 4.6 మీ మీల వర్షపాతం నమోదైంది. మార్కాపురం డివిజన్ లో సాధారణ వర్షపాతం 13.8 మీ మీ లు కాగా శనివారం నాడే 180 .0 మీ మీ ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మార్కాపురం , రాచర్ల గిద్దలూరు లలోనే వర్షపాతం నమోదైంది. మార్కాపురం లో47 .4 రాచర్ల 37 6, గిద్దలూరు లో 34 .2 మీమీలు నమోదైంది.

## గ్రంధాలయాలు విజ్ఞాన బాండాగారాలు



**గిద్దలూరు పెన్ పవర్ మే 18 :** గిద్దలూరు లోని శాఖ గ్రాధాలయం లో వేసవి విజ్ఞానశిభిరంలో ఆదివారం విద్యార్థిని, విద్యార్థులకు వివిధ ఆటల పోటీలను నిర్వహిం చారు. ఇందులో పాటల పోటీలు, చదరంగం జనరల్ నాలెడ్జ్ ఇంగ్లీష్ గ్రామర్ వంటి వేసవి శిక్షణ తరగతుల నిర్వహించారు. ఈ సందర్బంగా ఏర్పాటైన సమావేశంలో విశ్రాంత ఉప విద్యాశాఖ అధికారి ఎం కాశీశ్వర రావు విద్యార్థిని , విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రంధాలయాల వినియోగించుకొని ఎందరో మహానుభావులు తమలోని ప్రతిభను చాటుకున్నారని, గ్రంధాలయాలు విజ్ఞాన బాండా గారాలన్నారు. మంకు దొరకనటువంటి ఎన్నో పుస్తకాలు లభిస్తాయనిపేర్కొన్నారు. చిన్న పిల్లలకు అవసరమైన నీతి కథలుపుస్తకాలనుంచి పెద్దలకు అవసరమైన నవలలు , భారత, భాగవతం, రామాయణం, అనేక రీసెర్చ్, పాఠ్యఅంశ పుస్తకాలు లభ్యమవుతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన భాధ్యత మందేనన్నారు. కాకుండా విద్యార్థిని, వేసవి శలవులో వారిలో విజ్ఞానాన్ని పెంపొందించి, ఉన్నతంగా తీర్చిదిదేందుకు గ్రంధాలయంలో వేసవి విజ్ఞానశిభిరాలు నిర్వహించటం పిల్లల అదృష్టం అన్నారు. తల్లి దండ్రులు పిల్లలు గ్రంధాలయాలకు వెళ్ళేవిధాసంగా ప్రోత్సహించాల న్నారు. విద్యార్థులు చుదువుతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు కూడా ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో వృధాగా కాలయాపన చేయకుండా ప్రతిరోజు ఉదయము"8గంటల నుంచి 11"00 గంటలకు వరకు జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంత గానో దోహద పడుతున్నాయని, ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాపాలకురాలు ప్రసన్న కుమారి ఈ శిబిరాన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారని. ఆమె సేవలు ప్రసంశనీయమన్నారు. కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ప్రసన్న కుమారి శిక్షకులు రామిరెడ్డి విశ్రాంత ఉపాధ్యాయలు నిత్య సాయి పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన



**చంద్రశేఖరపురం,పెన్ పవర్ మే 18 :** చంద్రశేఖరపురం మండలంలోని ప్రముఖ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో శ్రీ నారాయణ స్వామి దేవస్థాన కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం అభిషేకం, గోపూజ, మహానివే దన కార్యక్రమంను అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణస్వామి వారి మూలవిగ్రహమూర్తిని ప్రత్యేక పూల అలంకరణతో ఏర్పాటు చేసి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం గోవుకు శాస్త్రోక్తంగా అర్చకులు గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ మహా నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్న ప్రసాదవితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఎస్పురం ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, ఇరగని చిన్న మాలకొండయ్య కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు

## డి.జి.పేట గ్రామ టిడిపి నూతన కమిటీ ఎన్నిక



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ మే 18 :** కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు చంద్రశేఖరపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొమ్మన బోయిన వెంకటేశ్వర్లు (వెంగయ్య) ఆధ్వర్యంలో దర్శిగుంటపేట పంచాయితీ పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులతో సమావేశం నిర్వహించి, తెలుగుదేశం పార్టీ శ్రేణుల అభిప్రాయాల ప్రకారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గ్రామ పార్టీ అధ్యక్షులుగా షేక్ అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షులుగా గోళ్ల తిరుపతయ్య, ప్రధానకార్యదర్శిగా బండారు రాజు,76 వ బూత్ కన్వీనర్గా కువ్వారపు ఏసురత్నం,77వ బూత్ కన్వీనర్ గా షేక్ ఖలీం,78వ బూత్ కన్వీనర్గా గోదాసు జయరాములను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, సి యస్ పురం సర్పంచ్ శ్రీరామ్ పద్మావతి, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు పునుగుపాటి రవికుమార్, అట్లూరి రామకృష్ణంరాజు, యూనిట్ ఇన్చార్జీలు బత్తుల వెంకటాద్రి, కోనంగి వెంకట కొండయ్య, జగన్నాథం లక్ష్మి, పావలి తిరుపతయ్య,చావా చంద్రశేఖర్, రేనాటి వెంకటేశ్వర్లు, కువ్వారపు యాకోబు, ఊటుకూరి ప్రసాద్, అన్నెబోయిన తిరుపతయ్య, ఉర్లగంటి శ్రీనివాసులు, నన్నసాని మహాలక్ష్మయ్య, పావలి తిరుపతయ్య, దొంగరి వెంకటసుబ్బయ్య, బండారు సుబ్బారావు, బండారు వెంకట్రామయ్య టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## వార్డు ఇంచార్జ్‌లుగా బీజేపీ నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలి



**గిద్దలూరు పెన్ పవర్ మే 18 :** ఏపీలో గ్రామ పంచాయతీ వార్డుల వారిగా బీజేపీ నేతలను ఇంచార్జ్ లుగా నియమించాలని ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గ కో కన్వీనర్ గుమ్మా రాముడు యాదవ్ డిమాండ్ చేశారు. ఇంచార్జ్ లుగా బీజేపీ నేతలకు ప్రాధాన్యత ఇస్తే ఏపీలో కూటమి బలోపేతం అవుతుందని, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలిగే అవకాశం ఉంటుందని అన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం పలు అభివృద్ధి పనులను పూర్తి చేస్తోందని అన్నారు దీనికి మన అధిష్టానం గమనించాలని కోరారు.

## బాబు గారూ.. శ్రమకు తగ్గ వేతనం ఇవ్వండి

### - ఏపీఎంసిఏ రాష్ట్ర కార్యదర్శి బిర్రు సందీప్ కుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ కుమార్ నాయక్
### ఒంగోలులో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల మానవహారం, నిరసన ర్యాలీ





**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ మే 18 :** 6 సంవత్సరాలు పనిచేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను ఆయుష్మాన్ భారత్ నిబంధనలు ప్రకారం క్రమబద్ధీకరించాలని, 40 వేలు వేతనం చెప్పి సర్కులర్ ఇచ్చి 25 వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారన్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మా ఆవేదన ను అర్థం చేసుకుని శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసిఏ) రాష్ట్ర కార్యదర్శి బిర్రు సందీప్ కుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ కుమార్ నాయక్ లు పేర్కొన్నారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద గల చర్చి సెంటర్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ 20 వ రోజు సమ్మె లో భాగంగా ఆదివారం మానవహారం, భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని, తమ డిమాండ్లపై చర్చించేందుకు చర్చలకు ప్రభుత్వం ఆహ్వానించాలని నినాదాలు చేశారు. అనంతరం ఏపీఎంసిఏ నాయకులు బిర్రు సందీప్ కుమార్, వినోద్ కుమార్ నాయక్ లు మాట్లాడుతూ గ్రామీణ కొండ ప్రాంతాలలో సెల్ ఫోన్ నెట్వర్క్ లేనిచోట పనిచేస్తుంటే ఎఫ్ ఆర్ ఎస్ అని చెప్పి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ కు మాత్రమే జీతాలు కట్ చేస్తున్నారని వాపోయారు. గత ప్రభుత్వంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు అందరికి జీవో నెంబర్ 64 తో ఇచ్చిన 23 శాతం హైక్ వెంటనే అమలు పరచాలని కోరారు. సంవత్సర కాలంగా పెండింగ్ లో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ల అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది వేల మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ గ్రామీణ, కొండా ప్రాంతాలతో పాటు మారుమూల గ్రామాలలో సేవలు అందిస్తున్నామని, ఒక్కో జిల్లా పరిధిలో 500 మంది వరకు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 8 నుండి 9 వేల మంది మహిళలు పనిచేస్తున్నామన్నారని తెలిపారు. మహిళ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు వారికి భద్రత కల్పించకుండా రాత్రి 8 గంటలకు ఎఫ్ ఆర్ ఎస్ వేయమని ఆజ్ఞలు జారీ చేయడం చాలా బాధాకరమని తెలియజేశారు. ఢిల్లీ, హైదరాబాద్ లాంటి నగరాలలో లైంగిక వేధింపులకు ఎక్కువ జరుగుతుంటే గ్రామీణ ప్రాంతాలలో భద్రత లేని చోట పొలాలలో ఊరి బయట ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లలో 24 గంటలు ఎలా ఉండాలని మహిళ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వాపోయారు. గత ఆరు సంవత్సరాల నుంచి గ్రామీణ,కొండ ప్రాంత ప్రజల ఆరోగ్య సేవలు అందిస్తూ ఎంతో నాణ్యమైన వైద్య సేవలైన క్యాన్సర్ స్క్రీనింగులు, ఎన్ సి డి సి డి స్క్రీనింగ్ లు, టెలిమెడిసిన్ సేవలు , చిన్నపిల్లలకు గర్భవతులకు 12 రకాల సేవలు అలాగే 14 రకాల డయాగ్నోస్టిక్ టెస్టులు చేస్తున్నటువంటి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లపై చిన్న చూపు తగదని ప్రభుత్వం వారు దయ చూపాలని మండుటెండలో తారు రోడ్డుపై మోకాళ్ళపై నిలబడి వేడుకున్నారు.. తమ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్.. ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ లు తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు. రద్దు చేసిన ఈ పి ఎఫ్ ఓ ను పునరుద్దించాలని డిమాండ్ చేశారు.. అలాగే ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లను శుభ్రం చేయడానికి కంటిజెంట్ వర్కర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోని 538 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లు, ఏపీఎంసీఏ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంగళగిరి రాజేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ శ్రీకాంత్ ,జిల్లా సెక్రెటరీ గంట ప్రసన్న ,జిల్లా ఉప అధ్యక్షురాలు జీవన్ జ్యోతి, పసుపులేటి శైలజ ,దీప్తి, కామేష్ ,రామాంజనేయులు పాల్గొన్నారు.

## వధూవర్లకు ఆసుశీస్సులు అందజేసిన ఎమ్మెల్యే ముత్తుముల, సోదరుడు




**గిద్దలూరు పెన్ పవర్ మే 18 :** ఆదివారం నాడు జరిగిన పలు వివాహ వేడుకల్లో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోకరెడ్డి , ఆయన సోదరుడు కృష్ణ కిషోర్ రెడ్డి లు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. గిద్దలూరు మండలం, తంబళ్లపల్లె పంచాయతీ, గుమ్ముళ్లపల్లె గ్రామంలో శిరుమాని నడిపి వెంకటయ్య కుమారుడు శ్రీకాంత్, త్రివేణిలకు జరిగిన వివాహ కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, చేరెడ్డి జయరామిరెడ్డి, గుంద్రెడ్డి రమణయ్య స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే సోదరుడు కృష్ణకిశోర్ రెడ్డి గిద్దలూరు పట్టణంలోని శ్రీ విట్టా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో పట్టణానికి చెందిన నులక లక్ష్మీదేవి కుమారుడు సుదర్శన్ రెడ్డి" వీణ" లకు జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బ్యాంకు చైర్మన్ గోపిరెడ్డి జీవన్ రెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. గిద్దలూరు పట్టణం, వెంకటేశ్వర కాలనీ, 3వ లైన్ లో పగడాల శ్రీనివాసులు కుమారుడు. సాయి కిషోర్ హిమబిందు" లకు జరిగిన వివాహ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చెరుకూరులో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



**రిపోర్టర్ మార్టూరు, పెన్ పవర్ మే 18 :** సామాన్య మధ్యతరగతి కుటుంబం మాది గత అనేక ఏళ్లుగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాజకీయాలకతీతంగా వైద్య శిబిరాలు మోకాళ్ళ ఆపరేషన్లు కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. కొంతమంది నాయకులు ఎన్నికల వరకే రాజకీయాలు కోసం ఆర్భాటంగా వైద్య శిబిరాలు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుంటారు. కానీ ఎమ్మెల్యే ఏలూరి ప్రజాసేవ ఎక్కడ రాజకీయాలు లేకుండా నిరంతరం కొనసాగిస్తూ ప్రజల చెంతకే కార్పొరేట్ వైద్యానికి.. తీసుకువచ్చి రూపాయి ఖర్చు లేకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ కంటి ప్రదాతగా ఆరోగ్య ప్రదాతగా నిలుస్తున్నారని.. ఆయనకు మా ఆశీస్సులు నిండు నూరేళ్లు ఉండాలని క్యాంపు కు చిన్న పలువురు కంటి బాధితులు ఎమ్మెల్యే ఏలూరిని ఆశీర్వదించారు. ఆదివారం పర్చూరు నియోజకవర్గంలోని పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో చెరుకూరు గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరానికి పర్చూరు మండలం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో.. విశేష స్పందన లభించింది. తొలుత స్వర్గీయ ఎన్టీ రామారావు విగ్రహానికి ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు వక్తలు ప్రసంగించారు. రాజకీయాలకతీతంగా ఎమ్మెల్యే ఏలూరి నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ప్రజా గుండెల్లో చెరగని ముద్రవేశారని కొనియాడారు. ప్రజాసేవే లక్ష్యంగా నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేయడంలో ఎమ్మెల్యే ఏలూరికి ఎవరు సాటిరారని పేర్కొన్నారు. వ్యవసాయ ఆదారితమైన పర్చూరు నియోజకవర్గంలో పేద మధ్య తరగతి కుటుంబాలకు ఆరోగ్య భద్రత నిస్తూ ప్రతినిత్యం అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. తన నియోజకవర్గ ప్రజలకు మంచి ఆరోగ్యం ఉండాలని తలంపుతో కార్పొరేట్ ఆసుపత్రులను అనుసంధానం చేస్తూ ప్రతి నెల వైద్య సేవలు నిర్వహించడం.. ఆరోగ్యశ్రీ ద్వారా సీఎంఆర్ ద్వారా ప్రతినిత్యం ప్రజల బాగోగులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి సేవలందించడం అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు పైసా ఖర్చు లేకుండా ఎమ్మెల్యే ఏలూరి సొంత నిధులతో ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తూ ప్రజా నాయకుడిగా నిలిచారన్నారు. ప్రచార ఆర్భాటం లేకుండా నిరంతరం సేవ చేయడం ఏలూరి నైజం అన్నారు. తన నియోజకవర్గంలో లక్ష మందికి తన వంతు బాధ్యతగా కంటిచూపు అందించాలని గొప్ప సంకల్పంతో ఎమ్మెల్యే ఏలూరి ముందుకు రావడం అందరికీ గర్వకారణం అన్నారు. రాజకీయాలకతీతంగా సమాజ సేవకు నిరంతరం పరితపించే వ్యక్తి ఏలూరి అని కొనియాడారు.

**విశేష స్పందన... :**

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 8 గంటలకే ప్రజలు పెద్ద ఎత్తున క్యాంపుకు హాజరయ్యారు. క్యాంపుకు హాజరయ్యే వారికోసం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక షామియానాలు ఏర్పాటు చేశారు. మహిళలకు పురుషులకు వేరువేరుగా వైద్య పరీక్షలు నిర్వహించేలా ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారం వద్ద రెండు ఓపి కేంద్రాలను ఏర్పాటు చేసి, క్యాంపుకు వచ్చిన వారికి బీపీ షుగర్ రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాంపుకు 553 మంది హాజరు కాగా వారిలో 158 మందికి చికిత్సలు నిర్వహించేలా వైద్యులు రిఫర్ చేశారు. మజ్జిగ మంచినీళ్లు బిస్కెట్ ప్యాకెట్లు అందించారు క్యాంపు అనంతరం భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు షేక్ శంషుద్దీన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఉషారాణి, కారుమంచి కృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బాపట్ల పార్లమెంటు ఉపాధ్యక్షులు షేక్ జమాలుద్దీన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాలేటి కోటేశ్వరరావు, రామకృష్ణ నాయకులు మానం హరిబాబు, మక్కెన శేఖర్ బాబు, సాంబయ్య, ఫ్యాక్టరీ శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు, అప్పలనే నరేంద్ర, నాగరాజు, శంకర్రావు, ఆదినారాయణ, వెంకటసుబ్బయ్య, దాస్, భుట్టో, తదితరులు పాల్గొన్నారు.

# యూఎస్ లో వంతెనను ఢీకొన్న నేవీ నౌక... షాకింగ్ వీడియోలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూయార్క్ లోని బ్రూక్లిన్ వంతెనను మెక్సికన్ నేవీ శిక్షణా నౌక ఢీకొట్టింది. ఈ ప్రమాదానికి సంబంధించిన పలు వీడియోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఓడకు సంబంధించిన మూడు మాస్ట్ ల పైభాగం ఐకానిక్ బ్రిడ్జ్ ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకొంది. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా.. సుమారు 19 మంది గాయపడ్డారు. అవును... బ్రూక్లిన్ వంతెనను మెక్సికన్ నౌక ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. 19 మంది గాయపడ్డారు. గాయపడినవారిలో ఇద్దరి పరిస్థితి విషయంగా ఉందని చెబుతున్నారు. మెక్సికన్ నౌక తూర్పు నది గుండా వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఓడలో సుమారు 277 మంది ఉన్నారని చెబుతున్నారు.

ఈ సందర్భంగా స్పందించిన న్యూయార్క్ మేయర్ ఎరిక్ ఆడమ్స్... ఈ ఘటనలో ఇద్దరు మరణించగా, 19 మంది గాయపడ్డారని, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన మెక్సికన్ నేవీ... సుమారు 297 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు గల అకాడమీ శిక్షణ నైక కువాటెమోక్ ఈ ప్రమాదంలో దెబ్బతిందని తెలిపింది!ఇదే సమయంలో.. ఈ నౌక ప్రతీ సంవత్సరం మిలటరీ స్కూల్ శిక్షణ పూర్తి చేయడానికి బయలుదేరుతుందని చెబుతున్నారు. దీని తాజాగా.. ఏప్రిల్ 6న ఈ నౌక మొదలవ్వగా.. అక్కడ నుంచి కింగ్ స్టన్ (జమైకా), హవానా (క్యూబా), కోజుమెల్ (మెక్సికో), న్యూయార్క్ (అమెరికా) సహా 15 దేశాల్లోని 22 ఓడరేవులను సందర్శించాలని షెడ్యూల్ చేసుకుంది!


# అమెరికాను వణికించిన టోర్నడో.. 27 మంది మృతి.. కర్ఫ్యూ విధించిన అధికారులు!



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా మధ్య-పశ్చిమ ప్రాంతాన్ని ఒక భయంకరమైన తుఫాను అతలాకుతలం చేసింది. ఈ బీభత్సంలో ఇప్పటివరకు కనీసం 27 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో కెంటకీలో సంభవించిన పెనుగాలుల కారణంగా మరణించిన తొమ్మిది మంది కూడా ఉన్నారు. శుక్రవారం రాత్రి లారెల్ కౌంటీలో వచ్చిన టోర్నడో కారణంగా చాలా మంది తీవ్రంగా గాయపడ్డారని కెంటకీ అధికారులు తెలిపారు. లారెల్ కౌంటీ షెరీఫ్ జాన్ రూట్ కార్యాలయం సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రాణాలతో బయటపడిన వారి కోసం ప్రభావిత ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. ఇదిలా ఉండగా మిస్సౌరీలో ఏడుగురు మరణించారు. అధికారులు ఇంటింటికి వెళ్లి చిక్కుకున్న లేదా గాయపడిన వారి కోసం వెతుకుతున్నారు. మిస్సౌరీలో కనీసం ఒక టోర్నడోతో సహా అనేక తుఫానులు సంభవించాయి. ఈ తుఫానులు శుక్రవారం వచ్చిన భీకరమైన వాతావరణ వ్యవస్థలో భాగం, దీని కారణంగా విస్కాన్సిన్‌లో టోర్నడో వచ్చింది. గ్రేట్ లేక్స్ ప్రాంతంలో లక్షలాది మంది వినియోగదారులు విద్యుత్ లేకుండా ఉండాల్సి వచ్చింది. టెక్సాస్‌లో తీవ్రమైన వేడి గాలులు వీచాయి.

తుఫాను కారణంగా భవనాలు ధ్వంసమయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అధికారులు స్థానికులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సెయింట్ లూయిస్ మేయర్ కారా స్పెన్సర్ మాట్లాడుతూ.. ఈ విపత్తు కారణంగా 5,000 కంటే ఎక్కువ ఇళ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. అనేక ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. పరిస్థితి నిజంగా వినాశకరమని స్పెన్సర్ అన్నారు. నగరంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించే ప్రక్రియ కొనసాగుతోందని, అత్యధిక నష్టం జరిగిన ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించామని ఆమె తెలిపారు. వాతావరణ శాఖ ప్రకారం.. సెయింట్ లూయిస్ ప్రాంతంలోని మిస్సౌరీలోని క్లేటన్‌లో మధ్యాహ్నం 2:30 నుంచి 2:50 గంటల మధ్య భీకరమైన తుఫాను సంభవించింది.

# ఇస్రో 101వ రాకెట్ ప్రయోగం.. దీనివల్ల ప్రయోజనాలేమిటో తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఇటీవల పలు సంచలనాలు సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా 101వ రాకెట్ ను ప్రయోగించింది. ఇందులో భాగంగా.. పీ.ఎస్.ఎల్.వీ – సీ 61 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. దీనితో.. ఈఓఎస్-09 (రీశాట్-1బి) ఉపగ్రహాన్ని పీ.ఎస్.ఎల్.వీ. నింగిలోకి తీసుకెళ్లింది. ఈ సమయంలో సాంకేతిక లోపం ఏర్పడింది. అవును... ఇస్రో చేపట్టిన 101వ రాకెట్ ప్రయోగం పీ.ఎస్.ఎల్.వీ – సీ 61 ప్రయోగంలో సాంకేతిక సమస్య ఎదురైంది. భూ పరిశీలనకు చెందిన ఈఓఎస్ – 09 ఉపగ్రహాన్ని నింగిలోకి తీసుకెళ్లిన కాసేపటి తర్వాత పీ.ఎస్.ఎల్.వీ – సీ 61 ప్రోగ్రాంలో సాంకేతిక సమస్య ఎదురైంది. దీంతో.. ఈ ప్రయోగం పూర్తి కాలేదు. దీనిపై ఇస్రో చైర్మన్ స్పందించారు. ఈ సందర్భంగా స్పందించిన ఇస్రో ఛైర్మన్ నారాయణన్.. ప్రయోగంలో మూడో దశ తర్వాత రాకెట్ లో సమస్య వచ్చిందని.. విశ్లేషణ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. కాగా... ఈ ఈఓఎస్ – 09 ఉపగ్రహం బరువు 1,696.24 కిలోలు కాగా.. దీని జీవితకాలం ఐదేళ్లు.

**దీనివల్ల కలిగే ప్రయోజనాలు!:**

ఈ ఉపగ్రహం అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ భూ ఉపరితల చిత్రాలను అధిక రిజల్యూషన్ తో తీయనుంది. ఈ క్రమంలో... నేషనల్ సెక్యూరిటీ, అటవీ పర్యవేక్షణ, విపత్తు నిర్వహణ, పట్టణ ప్రణాళికతో పాటు వ్యవసాయానికి సంబంధించిన అంశాలను ఇమేజింగ్ చేస్తుంది. 2022లో ప్రయోగించిన ఈఓఎస్-04 ఉపగ్రహానికి ప్రత్యామ్నాయంగా ఈఓఎస్-09ను పంపారు.

# ఏపీ ఫ్యూచర్ లీడర్స్ మీద బీజేపీ ఫోకస్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో బీజేపీకి ఏమి ఉంది ఎంత వరకూ బలం ఉంది అంటే రాజకీయాల మీద పూర్తి అవగాహన ఉన్న వారికి అన్నీ తెలుసు. బీజేపీ ఇచ్చేది పొత్తులలో నైతిక మద్దతు మాత్రమే. ఇక గ్రౌండ్ లో బీజేపీకి పెద్దగా బలం లేదు, అంతే కాదు సొంతంగా పోటీ చేస్తే డిపాజిట్లు రావు అన్నది కూడా తెలుసు. అయితే కేంద్రంలో బీజేపీ బలంగా ఉంది. ఆ పార్టీని దాటుకుని సమీప భవిష్యత్తులో ముందుకు వెళ్ళేందుకు మరో ఆల్టర్నేటివ్ పార్టీ కూడా జాతీయ స్థాయిలో లేకపోవడం బీజేపీకి వరంగా ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ కేంద్రంలో బలంగా ఉండడమే ఏపీ లాంటి చోట్ల ఆ పార్టీ పొత్తు రాజకీయాలకు రాయబేరాలకు ఎంగతానో ఉపయోగపడుతోంది. మరో వైపు చూస్తే బీజేపీ పొత్తులలోనే ఎపుడూ గెలుస్తూ వస్తోంది. ముఖ్యంగా టీడీపీ ఏర్పాటు అయ్యాక బీజేపీకి అప్పటిదాకా ఉన్న ఓటు బ్యాంక్ అటు టర్న్ అయింది అలా టర్న్ అయిన ఓటు బ్యాంక్ ని బీజేపీ తిరిగి పొందలేకపూఅతోంది. దాంతో టీడీపీతోనే ఉమ్మడి ఏపీలో విభజన ఏపీలో పొత్తు పెట్టుకునే సీట్లూ ఓట్లూ తెచ్చుకుంటోంది. తమాషా ఏంటి అంటే ఏపీలో ఉన్న మూడు ప్రాంతీయ పార్టీలు బీజేపీతో ప్రత్యక్షంగా పరోక్షంగా చెలిమి చేసేందుకు యత్నించడానికి చూడడమే. 2014 నుంచి 2018 దాకా బీజేపీ టీడీపీ ఘట బంధన్ కొనసాగించి. ఇక అదే టైంలో వైసీపీతో కూడా బీజేపీ సాఫ్ట్ కార్నర్ తో ఉంటూ వచ్చింది బహుశా ఇలాంటి అనుమానాలే బీజేపీతో టీడీపీ 2018లో కటీఫ్ ఇవ్వడానికి కారణం అయ్యాయని చెప్పాలి.

ఇక 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అలా బీజేపీతో పరోక్షంగా వైసీపీ స్నేహంగా ఉందని అంతా అనుకున్నారు ఇక 2024లో చూస్తే జనసేన టీడీపీలతో బీజేపీ చేతులు కలిపి కూటమి ప్రభుత్వంలో చేరింది. ఇక చూస్తే 2019 నుంచి 2024 మధ్యలో బీజేపీ ఏపీ పాలిటిక్స్ లో ఫ్యూచర్ లీడర్స్ గా జగన్ ని పవన్ ని చూసేది. 2020లోనే జనసేనతో పొత్తు పెట్టుకున్న బీజేపీకి ఏపీలో మరో రెండు దశాబ్దాలకు పైగా రాజకీయం చేసే బలమైన రాజకీయ నేతలు యువ నేతలు కావాల్సి వచ్చిందని అంటారు. అలా జగన్ తో ఒక వైపు పవన్ తో మరో వైపు బీజేపీ ఉంటూ వచ్చిందని ప్రచారంలో ఉంది. ఇక 2024లో చూస్తే పవన్ తో పూర్తిగా మిత్రృత్వం ప్రదర్శిస్తూ వస్తున్న బీజేపీ ఇటీవల కాలంలో టీడీపీలో యువ నేత భావి నాయకుడు అయిన లోకేష్ ని కూడా చేరదీయడాన్ని అంతా చూస్తున్నారు. తన వద్దకు కోరి ప్రధాని నరేంద్ర మోడీ పిలిపించుకోవడాన్ని చూసిన వారు అంతా ఏపీలో యూత్ లీడర్స్ మీద బీజేపీ ఫోకస్ చేస్తోంది అని అంటున్నారు. ఇక చూస్తే కనుక లోకేష్ లోని నాయకత్వ లక్షణాలను కూడా గమనిస్తూ వస్తున్న బీజేపీ భవిష్యత్తు రాజకీయ అవసరాల దృష్ట్యానే ఆయనతో కూడా మంచి అనుబంధం పెనవేసుకోవాలని చూస్తోంది అని అంటున్నారు ఇక ఇక్కడ చూస్తే వైసీపీ అధినేత జగన్ మీద బీజేపీ పెద్దల ఆలోచనలు ఏమిటి అన్న చర్చ కూడా సాగుతోంది. ఏపీలో టీడీపీ కానీ జనసేన కానీ వైసీపీతో ఏ విధనా బీజేపీ సాఫ్ట్ కార్నర్ చూపించినా అసలు సహించరు అని అంటారు. అయితే జాతీయ రాజకీయాలలో గండర గండడుగా పేరు గడించిన బీజేపీ ఏపీ రాజకీయాల్లో తనకు ఏది అనుకూలమో చూసుకుని తప్పకుండా చేస్తుందని భావిస్తున్నారు. అయితే జగన్ పాలనలో లిక్కర్ స్కాం జరిగిందని కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేస్తోంది. దీని మీద ఈడీ కూడా చూపు చూస్తోంది. ఈ నేపథ్యంలో జగన్ విషయంలో బీజేపీ కేంద్ర పెద్దల ఆలోచనలు ఏమిటి అన్నవి

తొందరలోనే తెలుస్తాయని అంటున్నారుఏది ఏమైనా చంద్రబాబుని సీనియర్ పొలిటీషియన్ గా భావిస్తున్న బీజేపీ భవిష్యత్తులో తాను బలపడాలీ అంటే ఫ్యూచర్ లీడర్స్ తోనే చెలిమి చేయాలని లెక్క వేసుకుని మరీ కొత్త రాజకీయాలకు తెర తీస్తోంది అని అంటున్నారు. చంద్రబాబు రాజకీయ చాణక్యుడు. ఆయన కనుక రాజకీయ విశ్రాంతిని కోరుకుంటే బీజేపీ తరువాత తరం నేతలతో తనదైన రాజకీయాలను చాలా ఈజీగా పండించుకుంటూ ముందుకు అడుగులు వేస్తుందని అంటున్నారు. మరి బీజేపీ ఆశలు నెరవేరుస్తూ ఆ పార్టీ బంధంలో దీర్ఘ కాలం ప్రయాణం చేసే నమ్మకమైన యువ నేత ఏపీలో ఎవరు అన్నదే చర్చగా ఉంది.

# మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు.. జైలుకు వెళ్లినా దూకుడు తగ్గ లేదా?

**వైసీపీ నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు నమోదైంది.**



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై మరో కేసు నమోదైంది. రాజధాని పరిధిలోని ఉద్దండరాయునిపాలెం గ్రామంలో టీడీపీ నేత రాజుపై మాజీ ఎంపీ, ఆయన సోదరుడు ప్రభుదాసు కలిసి దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మాజీ ఎంపీ చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుడు ప్రస్తుతం మంగళగిరి ఎయిమ్స్ లో చికిత్స పొందుతున్నాడు. వైసీపీలో దళిత నేతగా గుర్తింపు పొందిన నందిగం సురేశ్ 2019-24 మధ్య బాపట్ల ఎంపీగా పనిచేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ కు ఆయన అత్యంత సన్నిహితుడిగా చెబుతారు. వైసీపీ అధికారంలో ఉండగా, నందిగం సురేశ్ తిరుగులేని నేతగా చెలామణీ అయ్యారు. రాజధాని అమరావతి పరిధిలో నివసిస్తున్న మాజీ ఎంపీ సురేశ్.. అమరావతి వ్యతిరేక ఉద్యమం నడిపడంలో తెరవెనుక పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆయనను రాజధాని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాజధాని పరిధిలోని టీడీపీ నేతతో ఆయన ఘర్షణకు దిగడం చర్చనీయాంశమవుతోంది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై ప్రభుత్వం కఠిన వైఖరి ప్రదర్శించిందని అంటారు. వైసీపీ హయాంలో నమోదైన ఓ హత్య కేసులో మాజీ ఎంపీని నిందితుడిగా చేర్చి అరెస్టు చేశారు. ఒకే సామాజికవర్గానికి చెందిన రెండు వర్గాలు పరస్పరం దాడి చేసుకోవడం, ఆ ఘటనలో మరియమ్మ అనే మహిళ మరణానికి మాజీ ఎంపీ నందిగం కారణమని ఫిర్యాదుతో ఆయనను అరెస్టు చేసి సుమారు 90 రోజులు జైలులో ఉంచారు. అదేవిధంగా మరికొన్ని కేసులు కూడా నమోదు అవడంతో ఆయన కోర్టు, పోలీసుస్టేషన్ల మధ్యే తిరగాల్సివస్తోందని చెబుతున్నారు.

అదేవిధంగా టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులోనూ మాజీ ఎంపీ నందిగంపై ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పాత కేసులు అన్నింటిపైనా బెయిల్ తెచ్చుకున్న ఆయన టీడీపీ నేతపై దాడి చేయడంతో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది ఉత్కంఠ రేపుతోంది.

# డ్రోన్స్ ఎగుమతి హబ్ గా భారత్... షాకింగ్ గా జాబ్స్, మార్కెట్ లెక్కలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ లో డ్రోన్ల పరిశ్రమ వేగంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలో స్వదేశీ సాంకేతికపై దృష్టి సారిస్తూ అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఇదే సమయంలో.. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డీ.ఆర్.డీ.ఓ) మానవ రహిత విమానం డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది. ఇదే సమయంలో.. మరికొన్ని ప్రముఖ సంస్థలూ ఈ అధునాతన డ్రోన్ల తయారీని చేపడుతున్నాయి. అవును... భారత్ లో డ్రోన్ల పరిశ్రమ వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే డీ.ఆర్.డీ.ఓ మానవ రహిత విమానం డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది. మరోపక్క అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, టాటా అడ్వాన్స్ సిస్టమ్స్, హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ సంస్థలు ఈ అధునాతన డ్రోన్ల తయారీని చేపడుతున్నాయి. వీటిని సరిహద్దులో నిఘా, యుద్ధం కోసం రూపొందిస్తున్నారు! వాస్తవానికి ఇటీవల భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో ఇజ్రాయెల్ టెక్నాలజీతో బెంగళూరు స్టార్టప్ తయారు చేసిన స్కై స్ట్రైకర్ ఆత్మాహుతి డ్రోన్లను సైన్యం వినియోగించిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో.. హైదరాబాద్ కు చెందిన మారుత్ డ్రోన్స్ లాంటివి సైన్యానికి అవసరమైన ఔషదాలు, సరుకుల రవాణాకు కీలకంగా పనిచేశాయి. ఈ నేపథ్యంలో ఈ డ్రోన్ల రంగానికి అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రోత్సకాలు అందుతున్నాయి. ఇందులో భాగంగా.. 2024లో ప్రవేశపెట్టిన డ్రోన్ శక్తి పథకం, రక్షణ డ్రోన్ల అభివృద్ధికి నిధులను కేటాయించింది. ఈ సమయంలో స్టార్టప్ లకు రాయితీలు, రీసెర్చ్ కోసం గ్రాంట్లు అందిస్తోంది. ఈ క్రమంలో భారత డ్రోన్ మార్కెట్ విలువ రాబోయే ఐదారేళ్లలో (2030 నాటికి) సుమారు రూ.2 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇందులో రక్షణ డ్రోన్లదే అధిక వాటా కాగా... తర్వాత స్థానంలో వ్యవసాయం, విపత్తు నిర్వహణ, లాజిస్టిక్స్ మొదలైన విభాగాల్లోనూ డ్రోన్లకు అధిక గిరాకీ ఉంటోందని అంటున్నారు.

ఈ విధంగా డ్రోన్ల తయారీ రంగం అభివృద్ధి చెంది, భవిష్యత్తులో మన దేశాన్ని డ్రోన్ల ఎగుమతి హబ్ గా మార్చేందుకు దోహదం చేస్తాయని అంటున్నారు. ఈ సందర్భంగా... ఈ రంగంలో వేలాది కొత్త ఉద్యోగాలు వస్తున్నాయి. ప్రధానంగా సాఫ్ట్ వేర్ డెవలప్ మెంట్, తయారీ రంగాల్లో నిపుణులకు అధిక గిరాకీ ఉంటోందని చెబుతున్నారు.

# హైదరాబాద్‌కు తప్పిన పెను ముప్పు.. ఇద్దరు ఉగ్రవాదులు అరెస్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ పోలీసుల అప్రమత్తతతో పెను ముప్పు తప్పింది. హైదరాబాద్లో పేలుళ్లకు కుట్రపన్నిన ఇద్దరు ఉగ్రవాదులను కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సౌదీ నుంచి ఐసీస్ ఆదేశాలతో నగరంలో విధ్వంసం సృష్టించేందుకు దుండగలు ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. మన పోలీసుల అప్రమత్తత కారణంగా హైదరాబాద్ నగరానికి పెను ముప్పు తప్పిందని చెప్పవచ్చు. దుండగుల కుట్రను ఎలా ఛేదించిందీ పోలీసు అధికారులు వెల్లడించారు. సౌదీ నుంచి వచ్చిన ఆదేశాలతో నగరంలో విధ్వంసం సృష్టించేందుకు ఇద్దరు దుండగులు పక్కా ప్లానింగ్ తో నగరంలోకి అడుగు పెట్టారని మన కౌంటర్ ఇంటెలిజెన్స్ కు సమాచారం వచ్చినట్లు చెబుతున్నారు. ఇద్దరు దుండగుల్లో ఒకరు హైదరాబాద్ నగరానికి చెందిన వాడు కాగా, మరొకడు ఏపీలోని విజయనగరానికి చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. దుండగులు ఇద్దరు నగరంలో పేలుళ్లకు ప్లాన్ చేస్తుండటంతో పోలీసులు స్పెషల్ ఆపరేషన్ నిర్వహించారు. దుండగులు సిరాజ్, సమీర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయనగరంలో పేలుడు పదార్థాలు కొనుగోలు చేసి హైదరాబాద్ లో డమ్మీ బ్లాస్ట్ కు ఈ ఇద్దరు సిద్ధమయ్యారని పోలీసులు చెబుతున్నారు. దుండగులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారికి ఉగ్ర లింకులు ఎలా ఏర్పడిందీ విచారిస్తున్నారు. నగరంలో పేలుళ్లకు ప్రయత్నించిన వారిద్దరూ తెలుగు వారే కావడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.



# మళ్లీ పోరాడి ఓడిన రాజస్థాన్.. ప్లే ఆఫ్స్‌కు చేరువైన పంజాబ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో కీలక మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 10 పరుగుల తేడాతో గెలుపొందింది. 12 మ్యాచ్‌ల్లో ఎనిమిదో విజయం అందుకున్న పంజాబ్ (17 పాయింట్లు) ప్లే ఆఫ్స్‌కు అడుగు దూరంలో నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో రాజస్థాన్ 209/7కు పరిమితమైంది. యశస్వి జైస్వాల్ (50బీ 25 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్), వైభవ్ సూర్యవంశీ (40బీ 15 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మరోసారి మెరుపు ఆరంభం ఇచ్చినా రాజస్థాన్‌కు ఓటమి తప్పలేదు. తర్వాత వచ్చిన సంజు శాంసన్ (20బీ 16 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), రియాన్ పరాగ్ (13బీ 11 బంతుల్లో 1 సిక్స్) దూకుడుగా ఆడలేకపోయారు. ధ్రువ్ జురెల్ (53బీ 31 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) పోరాడినా మిగతా బ్యాటర్ల నుంచి సరైన సహకారం అందలేదు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన పంజాబ్ స్పిన్నర్ హర్‌ప్రీత్ బ్రార్ కీలక సమయంలో (3/22) వికెట్లు తీసి రాజస్థాన్‌ను దెబ్బకొట్టాడు. యాన్సెన్, ఒమర్జాయ్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

**జైస్వాల్, సూర్యవంశీ చెలరేగినా**

యశస్వి జైస్వాల్, సూర్యవంశీ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఫోర్లు, సిక్సర్లతో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. అర్ష్‌దీప్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో జైస్వాల్ వరుసగా నాలుగు ఫోర్లు, ఓ సిక్స్ బాదేసి 22 పరుగులు పిండుకున్నాడు. యాన్సెన్ బౌలింగ్‌లో వైభవ్ రెండు సిక్సర్లు, ఓ సిక్స్ రాబట్టాడు. బార్ట్‌లెట్ బౌలింగ్‌లో జైస్వాల్ మూడు బౌండరీలు బాదడంతో మూడు ఓవర్లకే స్కోరు 50 దాటింది. అర్ష్‌దీప్ వేసిన నాలుగో ఓవర్‌లో సూర్యవంశీ ఒక ఫోర్, రెండు సిక్స్‌లు బాదేశాడు. ఈ క్రమంలో వైభవ్ దూకుడుకు హర్‌ప్రీత్ బ్రార్ చెక్ పెట్టాడు. మరోవైపు, జైస్వాల్ దూకుడు కొనసాగించడంతో 8 ఓవర్లకే స్కోరు 100 దాటింది. 24 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకున్న యశస్వి.. హర్‌ప్రీత్ బౌలింగ్‌లోనే వెనుదిరిగాడు. శాంసన్ కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. ఈ క్రమంలో జురెల్, పరాగ్ నిలకడగా ఆడటంతో 13 ఓవర్లకు రాజస్థాన్ 143/3 పటిష్ఠస్థితిలో నిలిచింది. కానీ, తర్వాతి ఓవర్‌లోనే పరాగ్‌ను హర్‌ప్రీత్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. హెట్‌మయర్ (11బీ 12 బంతుల్లో) నెమ్మదిగా ఆడినా జురెల్ దూకుడు కొనసాగించడంతో రాజస్థాన్ విజయం దిశగా సాగింది. చివరి రెండు ఓవర్లలో విజయ సమీకరణం 30 పరుగులు కాగా.. 19వ ఓవర్‌లో అర్ష్‌దీప్ 8 పరుగులు మాత్రమే ఇచ్చాడు. చివరి ఓవర్‌లో యాన్సెన్ 11 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టడంతో పంజాబ్ గెలిచింది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్.. నేహాల్ వధేరా (70బీ 37 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు),

శశాంక్ సింగ్ (59లిబీ 30 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ శతకాలు బాదడంతో భారీ స్కోరు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (21బీ 10 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (30బీ 25 బంతుల్లో 5 ఫోర్లు), అజ్మతుల్లా ఒమర్జాయ్ (21లిబీ 9 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ప్రియాంశ్ ఆర్య (9), మిచెల్ ఓవెన్ (0) నిరాశపర్చారు. రాజస్థాన్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే 2, క్వెనా మఫాక, రియాన్ పరాగ్, ఆకాశ్ మధ్వాల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# ఇంగ్లాండ్ కౌంటీల్లో కోహ్లీ..? విలియమ్సన్ జట్టులో కింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించి ప్రపంచ క్రికెట్ ను షాకింగ్ కు గురి చేశాడు. కోహ్లీ టెస్ట్ క్రికెట్ కు గుడ్ బై చెప్పిన తర్వాత ఇంగ్లాండ్ కౌంటీల్లో కనిపించే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇంగ్లాండ్ కౌంటీ జట్టు మిడిలెసెక్స్ విరాట్ తో ఒప్పందం కుదుర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్లు ధృవీకరించింది. మే 12న కోహ్లీ టెస్టుల నుంచి రిటైర్మెంట్ ప్రకటించడంతో అతని అద్భుతమైన టెస్ట్ కెరీర్‌కు తెరపడింది. 36 ఏళ్ల కోహ్లీ ఇండియా తరపున 123 టెస్టులు ఆడి 30 సెంచరీలు, 31 అర్థ సెంచరీలతో సహా 9230 పరుగులు చేశాడు.మే 12న కోహ్లీ భారత టెస్ట్ జట్టు నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. కానీ అతని ఫస్ట్-క్లాస్ కెరీర్ గురించి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మిడిల్‌సెక్స్ క్రికెట్ డైరెక్టర్ అలాన్ కోల్‌మన్ గార్డియన్ మిడిలెసెక్స్ తరపున కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం గురించి కోహ్లీతో చర్చలు ప్రారంభించాలని కోరుకుంటున్నట్లు తన ఆసక్తిని తెలిపాడు. 2018లో ఇంగ్లాండ్ పర్యటనకు ముందు కోహ్లీ సర్రే తరపున సంతకం చేసినా మెడ గాయం కారణంగా ఆడలేకపోయాడు. ఒకవేళ కోహ్లీ మిడిలెసెక్స్ తరపున ఆడదానికి అంగీకరిస్తే విలియంసన్ తో పాటు ఒకే జట్టులో చూడొచ్చు.

భారత క్రికెట్ నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం.. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న క్రికెటర్లు విదేశీ లీగ్‌లలో పాల్గొనడానికి వీలు లేదు. అయితే ఆ ఫార్మాట్‌లో అంతర్జాతీయ క్రికెట్ నుండి రిటైర్ అయిన తర్వాత వారు ఇంగ్లీష్ కౌంటీ క్రికెట్, ఫస్ట్-క్లాస్ (కౌంటీ ఛాంపియన్‌షిప్), లిస్ట్ ఏ (మెట్రో బ్యాంక్ వన్డే కప్) టోర్నీల్లో ఆడటానికి అనుమతి ఉంది. ఇటీవలే టెస్ట్ ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ ఇంగ్లాండ్ కౌంటీ ఆడేందుకు ఆసక్తి చూపిస్తాడో లేదో చూడాలి. అద్భుతమైన ఫిట్ నెస్ ఉన్న 36 ఏళ్ళ కోహ్లీకి మరో మూడు నుంచి నాలుగేళ్లు ఈజీగా టెస్ట్ క్రికెట్ ఆడతారని భావించారు. కోహ్లీ మాత్రం అందరికీ ఊహించని షాకిస్తూ త్వరగానే టెస్ట్ ఫార్మాట్ కు వీడ్కోలు చెప్పాడు. ఇప్పటికే టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్.. ఇకపై వన్డేల్లో మాత్రమే కనిపించనున్నాడు. ప్రస్తుతం ఐపీఎల్ ఆడుతూ బిజీగా ఉన్న కోహ్లీ.. ఈ సీజన్ లో 505 పరుగులతో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల లిస్ట్ లో నాలుగో స్థానంలో నిలిచాడు.

# ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చిన బిగ్ బాష్ హీరో.. 39 బంతుల్లో సెంచరీ చేసిన ఓవెన్ ఎవరు..?





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 లో పంజాబ్ కింగ్స్ ఆదివారం (మే 18) రాజస్థాన్ రాయల్స్ తో జరుగుతున్న మ్యాచ్ లో కీలక మార్పులు చేసింది. మార్కస్ స్టోయినిస్, జోష్ ఇంగ్లిస్ పంజాబ్ జట్టులోకి చేరకపోవడంతో యువ సంచలనం మిచెల్ ఓవెన్ ప్లేయింగ్ 11లో చోటు సంపాదించాడు. గాయపడిన గ్లెన్ మ్యాక్స్ వెల్ స్థానంలో పంజాబ్ కింగ్స్ రీప్లేస్ మెంట్ గా ఆస్ట్రేలియా ఓపెనర్ మిచెల్ ఓవెన్‌ను ఎంపిక చేసుకుంది. పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో పెషావర్ జల్మీ తరపున ఆడుతున్న ఈ ఆసీస్ ఓపెనర్ రూ.3 కోట్లకు పీబీకేఎస్‌లో చేరాడు. ఐపీఎల్ లో అవకాశం రావడంతో ఓవెన్ పాకిస్థాన్ సూపర్ లీగ్ వదిలేసుకోనున్నాడు.

**ఎవరీ మిచెల్ ఓవెన్..?**

మిచెల్ ఓవెన్ 2024-25లో బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్)లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. హెూబర్ట్ హరికేన్స్ తరపున 200 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో 452 పరుగులు చేశాడు. బిగ్ బాష్ లీగ్ ఫైనల్లో ఓవెన్ కేవలం 42 బంతుల్లో 108 పరుగులు చేసి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్ లో 11 సిక్సర్లు, 6 ఫోర్లు ఉన్నాయి. బిగ్ బాష్ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసి సంచలనం సృష్టించాడు. ఈ మెగా ఫైనల్లో 39 బంతుల్లో సెంచరీ చేసి పాకిస్థాన్ సూపర్ లీగ్ లో.. ఆ తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ కు ఎంపికయ్యాడు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన మిచెల్ ఓవెన్ తన తొలి మ్యాచ్ లో డకౌటయ్యాడు. ఆడిన రెండో బంతికే మఫాకా బౌలింగ్ లో సంజు శాంసన్ కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. జైపూర్ లోని సవాయ్ మాన్సింగ్ స్టేడియంలో ప్రారంభమైన ఈ మ్యాచ్ లో పంజాబ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి నాలుగు ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసింది. ఆర్య (9), ఓవెన్ (0), ప్రబ్ సిమ్రాన్ సింగ్ (21) విఫలమయ్యారు.

# బాలీవుడ్ మేకర్స్ దృష్టిని ఆకర్షిస్తున్న డ్రాగన్ బ్యూటీ..?



మేఘా శుక్లా ఆరాధ్య డ్రెస్ లుక్ లో నెయిల్స్ వేసింది

ఒక్క సినిమా హీరోయిన్ ఫేట్ మార్చేస్తుంది అని చాలా మంది కథానాయికల కెరీర్ లో ప్రూవ్ అయ్యింది. ఇప్పుడు అదే తరహాలో ఒక హీరోయిన్ ని ఓవర్ నైట్ స్టార్ ని చేసింది. అంతకుముందు నుంచి సినిమాలు చేస్తున్నా కూడా ఒక సినిమాలో అది కూడా ఆమె చేసిన సెకండ్ హీరోయిన్ రోల్ తో సూపర్ పాపులర్ అయ్యింది. ఇంతకీ ఎవరా హీరోయిన్ అంటే డ్రాగన్ బ్యూటీ కయదు లోహార్ అని తెలుస్తుంది. కోలీవుడ్ లో పలు సినిమాల్లో నటించిన అమ్మడు శ్రీవిష్ణు చేసిన అల్లూరి సినిమాలో హీరోయిన్ గా చేసింది.ఐతే అప్పుడు అసలేమాత్రం జనాల దృష్టిలో పడని కయదు రీసెంట్ గా ప్రదీప్ రంగనాథ్ చేసిన డ్రాగన్ సినిమాతో అదరగొట్టేసింది. సినిమాలో ప్రదీప్ ఫస్ట్ హాఫ్ అనుపమని లవ్ చేస్తాడు సెకండ్ హాఫ్ లో కయదుతో పెళ్లికి రెడీ అవుతాడు. డ్రాగన్ సినిమాలో కయదు ఎంట్రీ మామూలుగానే అనిపించినా సినిమా నడుస్తున్నా కొద్దీ ఆమె నచ్చేస్తుంది. ఒకదశలో కయదుతో ప్రేమలో పడేలా చేస్తుంది. ఇక అమ్మడి గ్లామర్ షోకి కూడా కుర్రాళ్లు ఫిదా అయిపోయారు. సో అలా కయదు లోహార్ డ్రాగన్ సినిమాతో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఆ సినిమా రిలీజ్ తర్వాత ఆమె సోషల్ మీడియా ఫాలోవర్స్ కూడా బీభత్సంగా పెరిగారు. మరోపక్క కయదు లోహార్ తెలుగులో విశ్వక్ సేన్ సరసన ఫంకీ సినిమాలో ఛాన్స్ అందుకుంది. ఆ సినిమాతో అమ్మడు మరోసారి తెలుగు ఆడియన్స్ ముందుకు వస్తుంది. ఐతే సౌత్ ఆడియన్స్ ని ఎప్పటికప్పుడు వాచ్ చేస్తున్న ముంబై మేకర్స్ కయదు మీద ఉన్న ఈ బజ్ చూసి ఆమెని అక్కడ సినిమాల్లోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారట. ఓ విధంగా ఇది గొప్ప విషయమని చెప్పొచ్చు.డ్రాగన్ సినిమాతో కయదు నిజంగానే తన సత్తా చాటి అదరగొట్టే ఛాన్స్ లు అందుకుంటుంది. అమ్మడు ఇటు సౌత్ తో పాటు బాలీవుడ్ లో కూడా ఛాన్స్ అందుకుంటే మాత్రం అక్కడ ఆడియన్స్ ని కూడా తన బుట్టలో వేసుకునే ప్రయత్నం చేస్తుందని చెప్పొచ్చు. నిజంగానే కయదు బాలీవుడ్ షిఫ్ట్ అయితే మాత్రం అక్కడే టాప్ రేంజ్ కి వెళ్లే ఛాన్స్ లు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.





భీకరమైన ట్విస్ట్‌తో కూడిన శ్రీముఖి ఎత్నిక్ లుక్ టోటల్ విన్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com